

కొత్త జిల్లాలకు సూపరింటెండెంట్ ఇంజనీర్లు

» ఏపీఈపీడీసీఎల్ ఉత్తర్వులు


» అనకాపల్లి జిల్లా సర్కిల్ ఎస్ఈగా గొప్ప ప్రసాద్

» అల్లూరి సీతారామరాజు సర్కిల్ ఎస్ఈగా జీఎన్ ప్రసాద్

- 7లో

తాతయ్యబాబుకు హౌసింగ్

పీలా గోవిందకు 'అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్'



అనకాపల్లిలో పీలా గోవింద సత్యనారాయణను సత్కరిస్తున్న తెలుగుయువత నేతలు

- నామినేటెడ్ పదవుల్లో అనకాపల్లి జిల్లాకు ప్రాధాన్యం
- ఇద్దరికి కార్పొరేషన్ చైర్మన్ పదవులు
- పీవీజీ కుమార్, బోడపాటి శివదత్తులకు డైరెక్టర్ పోస్టులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తి చేసుకున్న వేళ 20 కార్పొరేషన్లకు చైర్మన్లను, కొన్నింటికి డైరెక్టర్లను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాకు చెందిన ఇద్దరు నేతలకు చైర్మన్ పదవులు వరించాయి. మరో ఇద్దరు నాయకులకు డైరెక్టర్ల పదవులు దక్కాయి. గత ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేని వారికి, పొత్తులో భాగంగా టికెట్లు త్యాగం చేసిన వారికి నామినేటెడ్ పదవుల కేటాయింపులో ప్రాధాన్యం కల్పించారు. కీలకమైన ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే, అనకాపల్లి టీడీపీ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణను నియమించారు. మరో కీలకమైన ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబుకు అవకాశం కల్పించారు. అనకాపల్లిలో పీలా గోవింద సత్యనారాయణ, బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో బత్తుల తాతయ్యబాబు క్యాంపు కార్యాలయాలకు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో చేరుకొని శుభాకాంక్షలు తెలిపారు. పూలమాలలు వేసి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు.

డైరెక్టర్లుగా ఇద్దరికి అవకాశం

ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా టీడీపీ మాడుగుల నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీజీ కుమార్, ఏపీ పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా పాయకరావుపేట నియోజకవర్గానికి చెందిన జనసేన నాయకుడు బోడపాటి శివదత్తు నియమితులయ్యారు.

పీవీజీ కుమార్ అసంతృప్తి

తెలుగుదేశం పార్టీ మాడుగుల నియోజకవర్గం ఇన్‌చార్జిగా చాలా కాలం నుంచి పనిచేస్తూ, మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేసిన తనకు ఏపీటీడీసీ డైరెక్టర్ పదవి ఇవ్వడంపై పీవీజీ కుమార్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గం ఇన్‌చార్జిగా పనిచేసిన తనకు డైరెక్టర్ పదవి ఇవ్వడం సరికాదని, అయితే తాను పార్టీని తప్పు పట్టడం లేదన్నారు. ఏపీటీడీసీ డైరెక్టర్ పదవిని స్వీకరించనని, ఎప్పటిమాదిరిగానే పార్టీ కోసం పని చేస్తానని తెలిపారు.

విధేయతకు పట్టం

అంకితభావానికి టీడీపీ అధిష్ఠానం గుర్తింపు

» ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా బత్తుల తాతయ్యబాబు

» పార్టీ జిల్లా అధ్యక్షునికి సముచిత పదవి



వడ్డాదిలో తాతయ్యబాబుకు కేక్ తినిపిస్తున్న టీడీపీ నాయకులు

చోడవరం, సెప్టెంబరు 24:

పార్టీ పట్ల అంకితభావం. అధినేత చంద్రబాబు నాయుడు మాటను జవదాటని నైజం. అన్నింటికి మించి తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో వున్నప్పుడు సారథ్య బాధ్యతలను భుజానికెత్తుకుని కార్యకర్తల్లో మనోధైర్యాన్ని నింపి, క్రమశిక్షణగల నేతగా గుర్తింపు పొందిన బత్తుల తాతయ్యబాబును టీడీపీ అధిష్ఠానం రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవితో సముచిత రీతిలో సత్కరించింది. తెలుగుదేశం పార్టీలో ఒక సాధారణ కార్యకర్త నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడిగా వున్న ఆయనకు పార్టీ అధినేత చంద్రబాబునాయుడు రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ పదవిని కట్టబెట్టారు. నామినేటెడ్ పదవులకు సంబంధించి మంగళవారం మధ్యాహ్నం విడుదల చేసిన తొలిజాబితాలోనే తాతయ్యబాబు పేరు వుండడంతో చోడవరం నియోజకవర్గంతోపాటు జిల్లా వ్యాప్తంగా టీడీపీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

ఈ ఏడాది సాధారణ ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జిగా వున్న బత్తుల తాతయ్యబాబుకు ఎమ్మెల్యే టికెట్ లభిస్తుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు భావించారు. అయితే చివరి నిమిషంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకు పార్టీ అధిష్ఠానం టికెట్ ఇచ్చింది. అయినప్పటికీ తాతయ్యబాబు అసంతృప్తి, నిరుత్సాహం చెందలేదు. పార్టీ నిర్ణయాన్ని ... మిగతా 6వ పేజీలో

ఇసుకకు మోక్షం లేదా!

గబ్బాడ డిపోలో 48,204 టన్నులు నిల్వ



గబ్బాడలో ఇసుక నిల్వలు

» రెండు నెలల క్రితం సందర్శించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

» విచారణ జరపాలని మైనింగ్, రెవెన్యూ శాఖలకు ఆదేశం

» ప్రతిమా ఇన్‌ఫ్రాకు చెందిన ఇసుకగా నిర్ధారణ

» అనుమతులు లేకుండా తవ్వారంటూ రూ.18.7 కోట్లు జరిమానా

» అయినాసరే ప్రారంభకాని ఇసుక అమ్మకాలు

నర్సీపట్నం, సెప్టెంబరు 24:

'కంచం నిండా అన్నం పెట్టి నోటికి తాళం వేసిన' చందంగా ఉంది నర్సీపట్నంలో ఇసుక నిల్వలు పరిస్థితి. నర్సీపట్నం మండలం గబ్బాడ డిపోలో 48,204 టన్నులు ఇసుక నిల్వలు ఉన్నట్టు రెవెన్యూ అధికారులు ప్రకటించారు. రెండు నెలలకు సరిపడా నిల్వలు ఉన్నప్పటికి రెవెన్యూ అధికారులు ఇసుక సరఫరాకు నిర్ణయం తీసుకోవడం లేదు. మూడు నెలలుగా గబ్బాడ డిపో నుంచి గుప్పెడు ఇసుక కూడా బయటకు రాలేదు. ఇసుకను ఎప్పుడు సరఫరా చేస్తారా అని భవన నిర్మాణదారులు ఎదురు చూస్తున్నారు. గబ్బాడ ఇసుక డిపో తలుపులు ఎప్పుడు తెరుస్తారని రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులను అడిగితే నోరు మెదపడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఒక పక్క ఉచిత ఇసుక విధానానికి తెరతీసింది. ఈ నెల 20 నుంచి ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ విధానం అందుబాటులోకి వచ్చింది. కానీ నర్సీపట్నం అధికారులు గబ్బాడ డిపోలోని ఇసుకను విక్రయించడంలేదు. దీంతో ఎక్కువ ధర చెల్లించి చుట్టుపక్కల ప్రాంతాల్లోని నదుల నుంచి టైర్ బళ్లతో ఇసుక కొనుక్కుంటున్నారు.

ఇసుక నిల్వలపై విచారణకు అయ్యన్న ఆదేశం

శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు జూలై 15వ తేదీన గబ్బాడ ఇసుక డిపోను సందర్శించారు. దీనిపై సమగ్ర విచారణ చేసి ఇక్కడున్న 63 వేల టన్నుల ఇసుకను నిల్వ చేసిన వారెవరో తేల్చాలని మైనింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇసుక అమ్మకాలు చేపడితే ఆధారాలు కనుమరుగు అవుతాయని, అందువల్ల ఇసుక దొంగలు ఎవరో తేలే వరకు ఇక్కడ నుంచి ఇసుక సరఫరా చేయొద్దని స్పష్టం చేశారు. దీంతో మైనింగ్, రెవెన్యూ అధికారులు గబ్బాడ డిపో నుంచి ఇసుక సరఫరాను ఆపేశారు. ఇసుక నిల్వలపై జిల్లా మైనింగ్ అధికారులు లోతుగా విచారణ చేశారు. రాజమహేంద్రవరం మైనింగ్ అధికారుల నుంచి సమాచారం తెప్పించుకున్నారు. గబ్బాడలోని ఇసుక ప్రతిమా ఇన్‌ఫ్రాకి చెందిందని తేల్చారు. పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరిపారని సదరు సంస్థకు రూ.18.7 కోట్లు జరిమానా విధిస్తూ ఈ నెల 12న డిమాండ్ నోటీసు ఇచ్చారు.

ఇసుక నిల్వలు ఎవరివో తేల్చినా....

శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు మైనింగ్ అధికారులు ఇసుక నిల్వలు ఎవరివో తేల్చి, జరిమానా విధించినప్పటికీ జిల్లా రెవెన్యూ అధికారులు గబ్బాడ డిపో నుంచి ఇసుక సరఫరాకు చర్యలు తీసుకోలేదు. ఇసుక నిల్వలను నెలల తరబడి ఉంచేయడం వల్ల గాలి, వర్షానికి తరిగిపోయే అవకాశం ఉంది. రోజుకు 800 టన్నుల చొప్పున విక్రయిస్తే గబ్బాడ డిపోలో ఉన్న ఇసుక రెండు నెలలకు సరిపోతుంది. ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత తీరడంతోపాటు భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లభిస్తుందని భవన నిర్మాణదారులు అంటున్నారు.

ట్రాక్టర్ ఇసుక రూ.9 వేలు!

నర్సీపట్నం ప్రాంతంలో ప్రభుత్వపరంగా ఇసుక అమ్మకాలు లేకపోవడంతో భవన నిర్మాణదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ఇసుకను కొనుగోలు చేయాల్సి వస్తున్నది. ఇదే అదనుగా భావించిన అక్రమార్కులు ఇసుక రేటును అమాంతం పెంచేశారు. సమీపంలోని వరహా, సర్పా, బొడ్డేరు నదులతోపాటు గెడ్డలు, వాగుల్లో ఇసుకను తవ్వి విక్రయిస్తున్నారు. టైర్ బండి ఇసుక రూ.1700 లకు అమ్ముతున్నారు.

వర్షంతో ఉపశమనం

» అనకాపల్లి, నర్సీపట్నం, పరవాడ ప్రాంతాల్లో కుండపోతగా వాన.. లోతట్టు ప్రాంతాలు జలమయం



పరవాడలో భారీ వర్షం

(ఆంధ్రజ్యోతి- న్యూస్‌నెట్‌వర్క్)

అనకాపల్లి పట్టణంతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం వేడిగావుండగా, సాయంత్రం తరువాత ఆకాశం మేఘావృతమైంది. సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో వాతావరణం మారిపోయి వర్షం మొదలైంది. అనకాపల్లి, నర్సీపట్నం, పరవాడ, తదితర ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. అనకాపల్లిలో సుమారు గంటన్నరపాటు కుండపోతగా వాన కురిసింది. పరవాడలో రెండు గంటలకుపైగా వర్షం పడింది. ఆ తరువాత జల్లులు పడుతూనే వున్నాయి. భారీ వర్షం కారణంగా అనకాపల్లి, నర్సీపట్నంలో డ్రైనేజీలు పొంగి రోడ్లపై వర్షం నీరు ప్రవహించింది. పరవాడ ఎస్సీ కాలనీ నీటమునిగింది. పెద్ద చెరువు బంద గట్టుకు గండిపడింది. వర్షం కురుస్తున్న సమయంలో ఈదురు గాలులు వీచడంతో ఈపీడీసీఎల్ అధికారులు ముందు జాగ్రత్త చర్యగా పలుచోట్ల విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. పరవాడలో రాత్రి 8 గంటల ప్రాంతంలో నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను 11 గంటలకు కూడా పునరుద్ధరించలేదు. అనకాపల్లిలో సుమారు రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. అయితే మూడు రోజుల నుంచి ఎండలతో అల్లాడిన ప్రజలు ఊరట చెందారు. కాగా రావికమతం, రాంబిల్లి, మాడుగుల మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది.

మహా రచ్చ

మేయర్‌పై ముడుపులు ఆరోపణలు

రాజీనామాకు కూటమి సభ్యుల పట్టు

» సభను రేపటికి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించి వెళ్లిపోయిన మేయర్

» కరోనా నుంచి ఇప్పటివరకూ యూసీడీలో రూ.4.75 కోట్లు అవినీతి జరిగిందని ఆరోపణ

» దీనిపై అప్పటి మునిసిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి వైసీపీ కార్యాలయం పేరుతో ఫిర్యాదు

» విచారణ జరపాలంటూ ఆదేశం

» విచారణను నీరుగార్చేందుకు మేయర్, అప్పటి కమిషనర్‌కు లంచాలు ముట్టాయని అభియోగం

» దీనిపై జిల్లా కలెక్టర్‌తో విచారణ జరిపిస్తామన్న కమిషనర్ సంపత్‌కుమార్

» మేయర్ పదవిలో ఉంటే విచారణకు ఆటంకం కాబట్టి రాజీనామా చేయాలంటూ పోడియంను చుట్టుముట్టిన కూటమి కార్పొరేటర్లు

» ఉక్కిరిబిక్కిరి అయిన మేయర్, వైసీపీ కార్పొరేటర్లు



మేయర్ పోడియం ముందు బైఠాయించిన టీడీపీ, జనసేన, బీజేపీ సభ్యులు

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ సర్వసభ్య సమావేశం మంగళవారం రసాభాసగా జరిగింది. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి జీవీఎంసీలో రూ.4.75 కోట్ల అవినీతి జరిగిందని, ఈ వ్యవహారంలో ప్రస్తుత మేయర్‌పైనా అభియోగాలు ఉన్నందున ఆమె రాజీనామా చేయాలంటూ కూటమి సభ్యులు పట్టుబట్టారు. ఊహించని పరిణామంతో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి కంగుతిన్నారు. ఆమె ముఖకవళికలు ఒక్కసారిగా మారిపోయాయి. వైసీపీ సభ్యుల నుంచి కూడా ఆశించిన మద్దతు లభించకపోవడంతో ఏం సమాధానం చెప్పాలో తెలియని స్థితిలో పోడియం దిగి అర్థంతరంగా తన ఛాంబర్‌కు వెళ్లిపోయారు. అయినప్పటికీ కూటమి సభ్యులు మేయర్ రాజీనామా చేయాలంటూ నినాదాలు కొనసాగించారు. కొద్దిసేపటి తర్వాత మేయర్ తిరిగి కౌన్సిల్‌హాలులోకి వచ్చి ఎజెండాను ప్రారంభించేందుకు యత్నించినప్పటికీ కూటమి సభ్యులు రాజీనామా చేయాలనే నినాదాలు చేయడంతో ఆమె సభను బుధవారానికి వాయిదావేస్తూ పోడియం దిగి వెళ్లిపోయారు.

మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు ... మిగతా 6వ పేజీలో

డిజిటల్ బాటలో సహకార సంఘాలు

అక్టోబరు 2 నాటికి రికార్డులన్నీ ఆన్‌లైన్

» ఇకపై పీఏసీఎస్‌లో సేవలు వేగవంతం

» రైతులకు మరింత సహకారం

నర్సీపట్నం, సెప్టెంబరు 24:

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని సహకార సంఘాలన్నింటిని డిజిటలైజేషన్ చేస్తున్నారు. పీఏసీఎస్‌లలో రికార్డుల కంప్యూటరీకరణ ప్రక్రియ అక్టోబరు 2 నాటికి పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కంప్యూటరీకరణ పూర్తయితే రైతులకు సేవలు వేగంగా అందనున్నాయి.

ఉమ్మడి విశాఖ జిల్లాలో 98 సహకార సంఘాలు ఉన్నాయి. వాటిలో విశాఖపట్నం జిల్లాలో 13, అనకాపల్లిలో 74, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11 ఉన్నాయి. అన్ని పీఏసీఎస్‌లలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన కంప్యూటర్లు, ప్రింటర్లు అమర్చారు. సభ్యుల ఆధార్ కార్డు, పాస్‌బుక్ జెరాక్స్ కాపీలతోపాటు ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటోను అప్‌లోడ్ చేస్తున్నారు.

మందకొడిగా డిజిటలైజేషన్

రికార్డుల ఆన్‌లైన్ ప్రక్రియను అక్టోబరు 2న.. గాంధీ జయంతి నాటికి పూర్తి చేసి ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకు రావాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రైతులు పాస్ పుస్తకం, ఆధార్ జెరాక్స్ కాపీలు అందజేయకపోవడంతో డిజిటలైజేషన్ మందకొడిగా సాగుతున్నది. ఉమ్మడి విశాఖ జిల్లాలోని డీసీసీబీ పరిధిలో 4.13 లక్షల సభ్యత్వాలు ఉంటే 2.8 లక్షలు మాత్రమే కంప్యూటర్‌లో నమోదు చేయగలిగారు.



చెట్టుపల్లి పీఏసీఎస్‌లో రికార్డులు ఆన్‌లైన్ చేస్తున్న దృశ్యం (ఫైల్)

రాజకీయ నాయకుల జోక్యంతో..

వాస్తవానికి వ్యవసాయ భూములు ఉండి పాస్ పుస్తకాలు ఉన్నవారికి రూ.300 కట్టించుకొని పీఏసీఎస్‌లలో సభ్యత్వాలు ఇవ్వాలి. అయితే రాజకీయ నాయకుల జోక్యంతో సహకార సంఘాల ఎన్నికలలో ఓట్ల కోసం రూ.10లు కట్టించుకొని కౌలు సర్టిఫికెట్లతో సభ్యత్వాలు ఇబ్బడిముబ్బడిగా ఇచ్చేశారు. పీఏసీఎస్‌లలో రూ.10ల సభ్యత్వాలే అధికంగా ఉన్నాయి. ఉదాహరణకు చెట్టుపల్లి పీఏసీఎస్‌లో ఏ-క్లాస్ సభ్యత్వాలు 2,136 ఉంటే అందులో రూ.10లు సభ్యత్వాలు ... మిగతా 6వ పేజీలో

శారదా బ్రిడ్జిపై విద్యుత్ సదుపాయం కల్పించాలి

▸▸ సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నేతలు డిమాండ్

కొత్తూరు, సెప్టెంబరు 24: అనకాపల్లి పట్టణాన్ని ఆనుకొని నూతనంగా నిర్మించిన బ్రిడ్జిపై విద్యుత్ సౌకర్యం కల్పించాలని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం వారు కొవ్వొత్తులతో నిరసన తెలియజేశారు. అనంతరం సంఘ జిల్లా అధ్యక్షుడు జొన్నకోట చెన్నమూర్తి మాట్లాడుతూ.. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ఈ బ్రిడ్జిపై పూర్తి స్థాయిలో విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రి సమయంలో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జిపై అన్ని విద్యుత్‌దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అనకాపల్లి పట్టణ ఉపాధ్యక్షుడు చందాన కృష్ణ, కార్యదర్శి రాజు, సహాయ కార్యదర్శి ద్వారపూడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన బాధితుడికి వైసీపీ రూ.లక్ష సాయం



కాశీనాయుడుకు చెక్కును అందజేస్తున్న కంబాల జోగులు

కోటవురట్ల, సెప్టెంబరు 24: అచ్యుతాపురం ఎస్‌ఈజెడ్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో గాయపడిన బోడపాలెం గ్రామానికి చెందిన జీరెడ్డి కాశీనాయుడుకి లక్ష రూపాయలు ఆర్థిక సాయాన్ని వైసీపీ పాయకరావుపేట నియోజకవర్గం ఇన్‌చార్జి కంబాల జోగులు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డీవీ.సూర్యనారాయణరాజు, వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సాగి సీతారామరాజు (దత్తుడు), ఎంపీపీ అప్పలనాయుడు, వైసీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ ఎరుకునాయుడు, యూత్ మండల అధ్యక్షుడు కర్లైడ సాయి పాల్గొన్నారు.

శ్రీప్రకాష్ విద్యార్థుల స్వచ్ఛతే హీ సేవ

పాయకరావుపేట, సెప్టెంబరు 24 : జాతీయ సేవా పథం దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్ఎస్ విద్యార్థులు మండలంలోని పాల్మన్‌పేట తీర ప్రాంతంలో స్వచ్ఛతే హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పాల్మన్‌పేట బీచ్‌లో వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు, చెత్తను తొలగించారు. అంతకుముందు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పీవోలు వి.భాస్కరరావు, జి.తాతయ్యనాయుడు, సుమారు వంద మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు

విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పుస్తకాల పంపిణీ

ఎలమంచిలి, సెప్టెంబరు 24: మండలంలోని పురుషోత్తపురం జడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న 11 మంది విద్యార్థులకు మంగళవారం వింగ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు ఎన్ఎంఎంఎస్ పుస్తకాలను పంపిణీ చేసినట్టు ఇన్‌చార్జి హెచ్ఎం మల్లిపాటి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వింగ్స్ ఫౌండేషన్ కార్యదర్శి ఎం. జయప్రకాష్ మాట్లాడుతూ ఈ స్టడీ మెటీరియల్ చదివి పరీక్షల్లో అర్హత సాధించిన ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.12 వేలు ఉపకార వేతనం పొందవచ్చునని తెలిపారు. విద్యార్థులకు ఈ పరీక్షల ఫీజులు కూడా ఫౌండేషన్ ద్వారా చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వింగ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆనంద్, ఉపాధ్యాయులు సుధారాణి, సీహెచ్. నాగరత్నం, బి.అనురాధ, నశ్రీన్, జి. సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

విధేయతకు పట్టం

... 5వ పేజీ తరువాయి

శిరోధార్యంగా భావించారు. దీంతో అధినేత చంద్రబాబు ఎన్నికల ముందు తాతయ్యబాబుకు పార్టీ జిల్లా పగ్గాలు అప్పగించారు. ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి విజయానికి ఆయన మనస్ఫూర్తిగా పనిచేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చోడవరంలో 41 వేల పైచిలుకు మెజారిటీతో తెలుగుదేశం విజయఢంకా మోగించిన విషయం తెలిసిందే. దీంతో పార్టీ పెద్దల వద్ద తాతయ్యబాబుకు గుర్తింపు మరింత పెరిగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మంగళవారం ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల తొలిజాబితాలో ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా తాతయ్యబాబును నియమించారు.

సామాన్య కార్యకర్త నుంచి...

తెలుగుదేశం ఆవిర్భావం నుంచి ఆ పార్టీలోనే కొనసాగుతున్న తాతయ్యబాబు సాధారణ కార్యకర్త నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ టీడీపీ జిల్లా అధ్యక్ష స్థాయికి చేరుకున్నారు. నాలుగు దశాబ్దాల కాలంలో పార్టీ పరంగా, ప్రజా ప్రతినిధిగా పలు పదవులు చేపట్టి, సమర్థంగా నిర్వహించారు. వడ్డాది పంచాయతీ వార్డు సభ్యుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆయన పంచాయతీ సర్పంచ్‌గా, బుచ్చెయ్యపేట ఎంపీపీగా పదవులు నిర్వహించారు. టీడీపీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జిగా, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. పార్టీ కార్యక్రమాల పరిశీలకుడిగా రాష్ట్రంలో పలు జిల్లాలకు బాధ్యునిగా వ్యవహరించారు.

చంద్రబాబు నమ్మకాన్ని నిలబెడతా : బత్తుల

నా నమ్మకం ఉంచి ఏపీ స్టేట్ హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా నియమించిన తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు నమ్మకాన్ని నిలబెడతాను. పార్టీలో సామాన్య కార్యకర్తగా ప్రస్థానాన్ని ప్రారంభించిన నాకు ఈ పదవిని అధిష్ఠానం ఇచ్చిన గుర్తింపుగా భావిస్తున్నాను. నామినేటెడ్ పదవి లభించడం చాలా ఆనందంగా ఉంది. ఈ పదవిని ఒక బాధ్యతగా భావించి హౌసింగ్ బోర్డు ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తాను.

డిజిటల్ బాటలో సహకార సంఘాలు

... 5వ పేజీ తరువాయి

వెయ్యి వరకు ఉన్నాయి. మిగిలిన 1,136 సభ్యత్వాలలో ఆధార్ కార్డులు, పాస్ పుస్తకాలు జెరాక్సులు అందజేసిన రైతులు 686 మంది ఉన్నారు. మిగిలిన రైతులు ముందుకు రావడం లేదు. ఇది కంప్యూటరీకరణకు ఆటంకంగా మారింది. అక్టోబరు 2 నాటికి ఎంతవరకు అయితే అంతవరకు రికార్డులు ఆన్‌లైన్ పూర్తి చేసి డిజిటల్ సేవలు ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. రికార్డులు ఆన్‌లైన్ చేయడం వల్ల బినామీ రుణాలు, అవకతవకలకు తావులేకుండా ఉంటుందని అంటున్నారు.

మహా రచ్చ

... 5వ పేజీ తరువాయి

ప్రారంభమైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి కౌన్సిల్ సమావేశం కావడంతో వైసీపీకి చెందిన ఎక్స్‌అఫీషియో సభ్యుడు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, కుంభా రవిబాబు, పండుల రవీంద్రబాబుతోపాటు బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, జనసేనకు చెందిన దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ హాజరయ్యారు. ముందుగా ఇటీవల మరణించిన సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు సీతారాం ఏచూరి, పశ్చిమ బెంగాల్‌లో హత్యాచారానికి గురైన మెడికో మృతిపట్ల సంతాపం ప్రకటించారు. అనంతరం పలు అంశాలపై చర్చ సాగింది. మధ్యాహ్న భోజన విరామ అనంతరం టీడీపీ కార్పొరేటర్ ఒకరు నగరంలో పారిశుధ్య కార్మికుల జీతాల నుంచి ఆదాయ పన్ను పేరిట మినహాయించిన రెండు శాతం సొమ్మును కొంతమంది యూసీడీ అధికారులు, సిబ్బంది కలిసి పంచుకున్నారని, ఈ వ్యవహారంలో మేయర్‌కు కూడా ముడుపులు అందాయని ఆరోపించడంతో కౌన్సిల్‌లో ఒక్కసారిగా దుమారం రేగింది.

సభను కుదిపేసిన యూసీడీ కుంభకోణం

వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి యూసీడీలో రూ.4.75 కోట్లు అవినీతి జరిగిందంటూ 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా ఆరోపించారు. దీనికి సంబంధించి వైసీపీ కార్యాలయం పేరుతో కొంతమంది అప్పటి రాష్ట్ర మునిసిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వైశ్రీలక్ష్మికి ఫిర్యాదు చేశారంటూ ఆ ప్రతిని సభలో చదివి వినిపించారు. 2019 ఎన్నికలకు ముందు టీడీపీ ప్రభుత్వం పసుపు కుంకుమ పేరుతో ఒక్కొక్కరికి రూ.పది వేలు చొప్పున జమ చేయగా, ఇన్‌యాక్టివ్‌గా ఉన్న 1,800 గ్రూపులతో ఆర్పీల ద్వారా కొత్తగా అకౌంట్ ఓపెన్ చేయించి రూ.95 లక్షలు యూసీడీ అధికారులు కాజేశారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 'ఆసరా' పథకం కింద మహిళా సంఘాలకు డబ్బులు ఇస్తే, జీవీఎంసీ పరిధిలోని 20 వేల గ్రూపుల్లో ఉన్న రెండు లక్షల మంది సభ్యుల నుంచి రూ.వంద చొప్పున రూ.20 లక్షలు యూసీడీ సిబ్బంది వసూలు చేశారని ఆరోపించారు. కొవిడ్ సమయంలో మాస్కులు కొనుగోలు పేరుతో నగరంలో లేని మహిళా ఆర్పీ ఖాతాకు రూ.ఐదు లక్షలు బదిలీ చేశారని ఆరోపించారు. వైసీపీ నేతల పిక్నిక్ పేరుతో వెయ్యి మంది ఆర్పీల నుంచి రూ.వెయ్యి చొప్పున వసూలు చేశారని ఆరోపించారు. అలాగే మహిళా సంఘాల ఆడిట్ పేరుతో కొంత, పారిశుధ్య కార్మికుల వేతనాల నుంచి ఐటీ పేరుతో కోత పెట్టిన రెండు శాతం మొత్తం కలిపి దాదాపు రూ.4.75 కోట్లు కుంభకోణం జరిగిందని ఆరోపించడంతో సభలో కలకలం రేపింది. దీనిలో మేయర్ తోపాటు అప్పటి కమిషనర్‌కు కూడా వాటాలు ఉన్నాయని, అందువల్లే రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించినా తొక్కిపడేశారంటూ మరో ఫిర్యాదు వెళ్లిందని రాపర్తి కన్నా ఆరోపించారు. దీంతో కూటమి సభ్యులతోపాటు సీపీఐ, సీపీఎం సభ్యులు కూడా మేయర్ రాజీనామా చేసి విచారణకు సహకరించాలని పట్టుబట్టారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. పోడియంను సభ్యులు చుట్టుముట్టి రాజీనామా చేయాలని డిమాండ్ చేయడంతో ఏం చేయాలో పాలుపోక మేయర్ సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించి సమావేశం నుంచి వెళ్లిపోయారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : పంచకర్ల



సబ్బవరం: పబ్లిక్ హెల్త్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

సబ్బవరం, సెప్టెంబరు 24 : ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. మండలంలోని నారపాడులో ఇది మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం అకుంఠిత దీక్షతో పని చేస్తున్నారన్నారు. అంతకుముందు ప్రభుత్వం రైతులకు సమకూర్చిన ఆరు ట్రాక్టర్లను రైతులు అందజేశారు. పీహెచ్‌సీ ప్రాంగణంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 50 లక్షలతో నిర్మించిన పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, వైస్‌ఎంపీపీ ఝాన్సీలక్ష్మీరాణి, ఎంపీటీసీ సభ్యులు బైలపూడి దేముడుబాబు, చైతన్య, ఎంపీడీవో బి పద్మ, కూటమి నేతలు భరణికాన బాబూరావు, గొర్లి రామునాయుడు, ఇందలి రమణ పాల్గొన్నారు.

ఎలమంచిలిలో.. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎప్పుడూ మంచే చేస్తుందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మంగళవారం ఏటికొప్పాకలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ74 ఏళ్ల వయస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడ వరదల్లో ప్రజల కోసం చూపిన చొరవ ఎప్పుడూ మరచిపోలేమన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గ్రామ పంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. రైల్వే గేటు వద్ద వంతెన నిర్మించడం జరుగుతుందని, పులపర్తి- ఏటికొప్పాక రహదారిని ఆధునికీకరణ చేస్తామన్నారు. అంతకుముందు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ, మాజీ సర్పంచులు కాండ్రకోట చిరంజీవి, అన్నం బాబుజీ ప్రభుత్వ పనితీరును కొనియాడారు. ఈ సందర్భంగా కూటమి నేతలు ఎమ్మెల్యే విజయకుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ భజంత్రీల లక్ష్మి, కూటమి నేతలు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, లవుడు లోవరాజు, రాజాన నారాయణమ్మ, ఇత్తంశెట్టి రాజు, రాజాన శేషు, పిట్టా శ్రీను, రాజాన వెంకునాయుడు, నగిరెడ్డి అచ్చియ్యనాయుడు, మోహన్, అధికారులు పాల్గొన్నారు.



మంచి ప్రభుత్వం బ్రోచర్‌ను అందిస్తున్న బుద్ద నాగజగదీశ్వరరావు

కశింకోటలో.. మండలంలోని ఏఎస్‌పేటలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను ప్రజలకు అందజేశారు. అనంతరం వైద్య శిబిరం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొలం పిలుస్తోంది పోస్టర్‌ను ఆవిష్కరించారు. కాగా ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణను ఎమ్మెల్యే కొణతాల అభినందించారు.

అనకాపల్లి టౌన్‌లో.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ప్రజాపాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక 81వ వార్డులోని బొత్సవారి వీధిలోఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటా తిరిగి కరపత్రాలు, బ్రోచర్లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దొడ్డి జగదీశ్వరరావు, కాండ్రేగుల సత్యనారాయణ, కొణతాల అప్పలరాజు, జామి శంకరరావు, బుద్ద చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

పరవాడలో.. మండలంలోని తానాంలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ కన్నూరు దేవి, ఎంపీటీసీ సభ్యురాలు రొంగలి సునీత ఇంటింటి కి వెళ్లి వంద రోజుల పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు గురించి వివరించారు. కార్యక్రమంలో కన్నూరు వెంకటరమణ, రొంగలి గోపాలకృష్ణ, వర్రి మంగలక్ష్మి, పైలా శ్రీరామ్మూర్తి, పైలా జానకిరావు, చీపురుపల్లి శ్రీనివాస్, గొరుపోతు సన్యాసిరావు, పంచాయతీ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

మునగపాకలో.. మునగపాకలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పి. పరశురాం ఇంటింటికి వెళ్లి వంద రోజుల పాలనలో అమలు చేసిన కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో దాడి శివ, శ్రీరామ్మూర్తి, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి పెంటకోట ఈశ్వరరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందిందని టీడీపీ జిల్లా కార్యదర్శి పీలా తులసీరామ్ అన్నారు. మంగళవారం ఖాజీపాలెంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ర్యాలీని నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి వంద రోజుల్లో ప్రభుత్వం చేసిన కార్యక్రమాలు గురించి వివరించారు.

పాయకరావుపేటలో.. రాష్ట్రంలో పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని బృందావనం తదితర ఏరియాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఇంటింటికి తిరిగి మన మంచి ప్రభుత్వం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు యాళ్ల వరహాలబాబు, మజ్జూరి నారాయణరావు, జూరెడ్డి ప్రసాద్, సీహెచ్.పేర్రాజు, ఆది, నారపురెడ్డి పద్మ, రాజారమేశ్ పాల్గొన్నారు.

పలు మండలాల్లో భారీ వర్షం



నీటమునిగిన పరవాడ ఎస్సీ కాలనీ



అనకాపల్లిలో కురుస్తున్న వర్షం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 24 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మంగళవారం రాత్రి పట్టణంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటకు పైగా వర్షం కురియడంతో అనకాపల్లి ప్రాంతమంతా విద్యుత్ సరఫరా లేక చీకటిమయమైంది. రెండు రోజులుగా వేడి వాతావరణంతో ఇబ్బంది పడ్డ ప్రజలకు ఈ వర్షం ఉపశమనం పొందారు.

పరవాడలో.. మండల కేంద్రంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. గంటకు పైగా ఏకధాటిగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పరవాడ ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున వరద నీరు పారింది. గత మూడు రోజులుగా కాసిన ఎండలతో అల్లాడిపోయిన ప్రజానీకానికి ఈ వర్షం ఎంతో ఊరటనిచ్చింది. భారీ వర్షం కారణంగా స్థానిక సినిమాహాల్ జంక్షన్ వద్ద ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించే వాహనదారులు అవస్థలు పడ్డారు. ఫార్మాసిటీ, తానాం పరిసర ప్రాంతాల్లో కూడా భారీ వర్షం కురిసింది.

రాంబిల్లిలో... మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు వర్షం కురవడంతో ప్రధాన రోడ్లు జలయమయ్యాయి. వెంకటాపురం-రాంబిల్లి నేవీ రోడ్డు, సంతపాలెం-వెల్చూరు మీదుగా పెదకలవలాపల్లి రోడ్డు, అప్పారాయుడుపాలెం రోడ్ల గోతుల్లో వర్షం నీరు చేరింది. దీంతో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి : సుందరపు



పి.బయ్యవరంలో పొలం పిలుస్తోందిలో పాల్గొన్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

ఎలమంచిలి, సెప్టెంబరు 24 : రైతు సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. మంగళవారం పి.బయ్యవరం, ఏటికొప్పాక గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో వేసిన ప్రతి పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేసి, ఈకేవైసీ చేయడం ద్వారా ఉచిత పంటల బీమాని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో మోహనరావు, కూటమి నేతలు గొర్లె నానాజీ, రాజాన శేషు, పిట్టా శ్రీను, కాండ్రకోట చిరంజీవి, నగిరెడ్డి అచ్చియ్యనాయుడు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రాంబిల్లిలో.. మండలంలోని కొప్పుగొండుపాలెం, పెదకలవలాపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత అధికారుల బృందం ఆయా గ్రామాల్లోని వరి పొలాలను పరిశీంచారు. వరి సాగులో చేపట్టాల్సిన చర్యలను వ్యవసాయధికారిణి సుమంత రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో కొప్పుగొండుపాలెం సర్పంచ్ బి.హరిబాబు, జనసేన మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, మాజీ సర్పంచ్ బి.రమణ, ఇరిగేషన్ అధికారి చిన్నారావు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో.. మండలంలోని నామవరంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ ఆదినారాయణ గ్రామంలో సాగవుతున్న ఖరీఫ్ పంటను పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ శ్రీరామ్మూర్తి, పశువైద్యాధికారిణి శరణ్య, ఆర్‌ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొత్తూరులో.. మండలంలోని కూండ్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అనకాపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు రామారావు, మండల వ్యవసాయాధికారి రంగాచారి పాల్గొని వరి క్షేత్ర సందర్శన చేశారు. సమావేశంలో శాస్త్రవేత్త చంద్రశేఖరరావు, పశు సంవర్ధక శాఖాధికారి రామారావు, ఉద్యానశాఖాధికారి లావణ్య, సర్పంచ్ నందారపు లక్ష్మి, టీడీపీ నాయకుడు నందారపు సూరిబాబు, మరపురెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

పరవాడలో.. యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా పంటల్లో అధిక దిగుబడులు పొందవచ్చునని మండల వ్యవసాయాధికారిణి సీహెచ్.చంద్రావతి అన్నారు. పరవాడ, వెన్నెలపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అధికారులు, స్థానిక నాయకులతో కలిసి వరి పొలాలను సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, ఉపసర్పంచ్ వెన్నెల సన్యాసిరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోటలో.. మండలంలోని ఏ.ఎస్.పేట, బయ్యవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు టి.రామారావు రైతులకు అవసరమైన సలహాలను, సూచనలను తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజింగ్ అధికారి మురళీ, డిఆర్‌సి ఏ.డి.శ్రీధర్, మండల వ్యవసాయాధికారిణి స్వప్న, శాస్త్రవేత్త చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో.. మండలంలోని దార్లపూడి, పెట్టుగోళ్లపల్లి గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయాధికారిణి ఏవో సౌజన్య ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది ద్వారా క్షేత్రాల్లో పర్యటించి, ఆధునిక పరిజ్ఞానాన్ని గురించి రైతులకు వివరిస్తామన్నారు.

ధర్మవరం రోడ్డుని వెడల్పు చేయాలి

▸▸ మండల సమావేశంలో వైస్ ఎంపీపీ గోవిందరావు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 24: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ కోన లోవలక్ష్మి అధ్యక్షతన జరిగింది. అధికారులు ఆయా శాఖలకు చెందిన వివరాలను సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ ఏఈ సుజాత మాట్లాడుతూ ధర్మవరం-ఎస్.రాయవరం ప్రధాన రోడ్డుపై తారు వేసేందుకు, రేవుపోలవరం నుంచి బంగారమ్మపాలెం రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయన్నారు. దీనిపై స్పందించిన వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు మాట్లాడుతూ ధర్మవరం-ఎస్.రాయవరం ప్రధాన రహదారిని వెడల్పు చేసి రోడ్డు వేయించాలని కోరారు. జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో లోపాలు ఉంటున్నట్టు తమ దృష్టికి వస్తుందని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఎంఈవోను కోరారు. సైతారుపేట సర్పంచ్ రమణబాబు, ఎంపీటీసీ సభ్యుడు సేనాపతి రాము మాట్లాడుతూ తమ గ్రామం వద్ద ఉన్న పంట కాలువకు గేట్లు లేకపోవడంతో సాగునీరు వృథాగా పోతుందని ఇరిగేషన్ ఏఈ భానుకు సమస్యను వివరించారు. దీంతో పలువురు సభ్యులు సాగునీటి వనరుల సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. దీనిపై ఆమె స్పందిస్తూ సాగునీటి వనరులపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. జలజీవన్ మిషన్ పనుల్లో తవ్విన రోడ్లకు మరమ్మతులను పైపులైను ట్రయల్ రన్ కాగానే పూర్తి చేస్తామని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, డీటీ కుమారస్వామి, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాహనాల డ్రైవర్లు నిబంధనలు పాటించాలి : సీఐ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 24 : మోటార్ వాహన చట్టం నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ స్పష్టం చేశారు. మంగళవారం ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద ఆటో డ్రైవర్లు, అంబులెన్స్ డ్రైవర్లతో ఆయన సమావేశమయ్యారు. వైద్యాలయానికి రోగులు అధిక సంఖ్యలో వస్తుంటారని, అటువంటి వారిని తీసుకువచ్చే వాహనచోదకులకు ఇబ్బందులు లేకుండా ఆటోలు, అంబులెన్స్‌లను పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనచోదకులకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామన్నారు.

30న ధర్నాను జయప్రదం చేయండి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 24 : కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఈనెల 30వ తేదీన జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు పిలుపునిచ్చారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో గ్రేటర్ విశాఖ మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అనకాపల్లి జోన్ గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్, యూనియన్ అధ్యక్షుడు అజయ్, నూకరాజు, శ్రీను పాల్గొన్నారు.

42 మంది ఎన్టీఆర్ భరోసాకు అర్హులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 24 : ఎన్టీఆర్ భరోసా పింఛన్ వెరిఫికేషన్‌లో భాగంగా మంగళవారం ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన సదరం క్యాంప్‌లో 42 మందిని అర్హులుగా గుర్తించినట్టు ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీనివాస్ తెలిపారు. ఈ శిబిరానికి రోలుగుంట, రావికమతం, మాడుగుల మండలాల నుంచి 67 మంది పరీక్షించుకునేందుకు రాగా వారిలోని 42 మందిని అర్హులుగా గుర్తించామన్నారు.

చేపల వేట నిషేధ భృతిని వెంటనే ఇవ్వాలి

రాంబిల్లి, సెప్టెంబరు 24: చేపల వేట నిషేధిత కాలంలో మత్స్యకారులకు చెల్లించాల్సిన జీవన భృతిని వెంటనే విడుదల చేయాలని వాడనర్సాపురం మాజీ కోఆప్షన్ సభ్యులు కొవిరి రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ ఏప్రిల్ 25 నుంచి జూన్ 14 వరకు చేపల వేట నిషేధించిన ప్రభుత్వం మత్స్యకారులకు పరిహారం చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ఎన్నికల్లో పరిహారాన్ని రూ.10 వేలు నుంచి రూ.20 వేల వరకు పెంచుతామని ఇచ్చిన హామీ మేరకు పరిహారాన్ని ఇవ్వాలని ఆయన కోరారు.

ల్యాండ్ పూలింగ్ లబ్ధిదారులకు 18 సెంట్లు ఇవ్వాలి

కొత్తూరు, సెప్టెంబరు 24 : ల్యాండ్ పూలింగ్‌లో తీసుకున్న తమ భూములకు బదులుగా 18 సెంట్లు ఇచ్చి, రిజిస్ట్రేషన్ చేయాలని 25 మంది లబ్ధిదారులు కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వారు కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతి పత్రం అందజేశారు. కుంచంగి గ్రామ రెవెన్యూ సర్వే నంబరు 373, 370, 375/2, 375/1, 384, 335లలో తమ భూములు ఉండేవని, ఆ భూముల్లో భవనాలు నిర్మించి నప్పటికీ తమకు ఇస్తామని 18 సెంట్లు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. తక్షణమే న్యాయం చేయాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

నక్కపల్లి, సెప్టెంబరు 24: మండలంలోని చినదొడ్డిగల్లు అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీవో డి.సీతారామరాజు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పిల్లల హాజరు పెంచాలని సూచించారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డీ బి.సత్యనారాయణ తదితరులు ఉన్నారు. అనంతరం చినదొడ్డిగల్లులో బుధవారం జరగనున్న ప్రజా వేదిక స్థలాన్ని పరిశీలించారు. హోం మంత్రి అనిత ఈ కార్యక్రమానికి హాజరవుతారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, నేతలు వెలగా శ్రీను, వెలగా సుధాకర్ పాల్గొన్నారు.

పట్టణ ఎస్ఐ సంతోష్‌కుమార్ బాధ్యతల స్వీకారం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 24 : పట్టణ ఎస్ఐగా కె.సంతోష్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. 2020 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐ సంతోష్‌కుమార్ ఇప్పటివరకు అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పనిచేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన అనకాపల్లికి నియమితులు కావడంతో మంగళవారం బాధ్యతలు చేపట్టారు.

కశింకోట ఎస్ఐగా మనోజ్‌కుమార్..

కశింకోట ఎస్ఐగా మనోజ్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇప్పటివరకు పెదబయలు ఎస్ఐగా పనిచేశారు. ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన మనోజ్‌కుమార్ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు.

కాలేజీ బ్రిడ్జిపై గోతులు పూడ్చివేత

కొత్తూరు, సెప్టెంబరు 24 : కొత్తూరు కాలేజీ బ్రిడ్జిపై పెద్ద గోతులను మంగళవారం పంచాయతీ పాలకవర్గం పూడ్చివేసింది. స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు సర్పంచ్ లక్ష్మీప్రసన్న, వరహాలబాబు, వార్డు మెంబర్లు తాడి చక్రవర్తి, పందల శ్రీనివాసరావు, మోసూరి నరసింగరావు, నీటిపల్లి రాజులు గోతులను పూడ్చివేశారు.

నంగినారపాడులో సంఘీభావ దీక్షలు

సబ్బవరం, సెప్టెంబరు 24 : తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ కావడంతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన 11 రోజుల దీక్షకు సంఘీభావంగా మంగళవారం నంగినారపాడులో జనసేన ఉమ్మడి రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందలి వెంకటరమణ ఆధ్వర్యంలో రామాలయంలో దీక్షలు చేపట్టారు. మహిళలతో పూజలు చేశారు. కార్యక్రమంలో ఎర్నిబాబు, బొడ్డేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తహసీల్దారు వరహాలు బాధ్యతల స్వీకారం

ఎలమంచిలి, సెప్టెంబరు 24: ఎలమంచిలి తహసీల్దారు ఎస్.వరహాలు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన రోలుగుంట నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన అయిన తహసీల్దారు రాణి అమ్మాజీ విశాఖ బదిలీ అయ్యారు. తహసీల్దారు వరహాలును కార్యాలయ ఉద్యోగులు అభినందనలు తెలిపారు. ఆదేవిధంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, కూటమి నేతలు పిట్టా శ్రీను, కొరారు నరేష్, గుర్రాల శేఖర్, లాలం సోమునాయుడు, పల్లా సత్యనారాయణ, దంట్ల స్వామి తదితరులు కలిసి అభినందించారు.

ఎస్ఎఫ్ఐ మండల నూతన కమిటీ

ఎలమంచిలి, సెప్టెంబరు 24: ఎస్ఎఫ్ఐ మండల నూతన కమిటీ ఎన్నిక మంగళవారం పట్టణంలోని ప్రైవేటు స్కూలులో నిర్వహించినట్టు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. బాలాజీ తెలిపారు. నూతన మండల అధ్యక్షుడిగా ఆర్.కేశవ, కారే మణికంఠ, ఉపాధ్యక్షులుగా రవి, లక్ష్మణ్, కృప, సహాయ కార్యదర్శులు గటా అబి, గణేష్, రాము ఎన్నికైనట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

పలువురు ఎంపీడీవోలు బాధ్యతల స్వీకారం

నక్కపల్లి, సెప్టెంబరు 24: మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) డి.సీతారామరాజు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన శ్రీనివాస్ కాకినాడ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఏవోగా పనిచేస్తున్న డి. సీతారామరాజును ఎంపీడీవోగా నియమించారు. రాష్ట్ర హోం మంత్రి అనితను ఎంపీడీవో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీడీవో సీతారామరాజును పలువురు అభినందించారు.

సబ్బవరంలో..

సబ్బవరం ఎంపీడీవోగా పి.పద్మజ బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆమె పశ్చిమగోదావరి జిల్లాకు వెళ్లి సాధారణ బదిలీల్లో ఇక్కడకు వచ్చారు. ఆమె గతంలో పరవాడ ఈవోపీఆర్‌డీగా పని చేశారు.

సీఎం సహాయ నిధికి కార్పెంటర్ల సంఘం విరాళం

పాయకరావుపేట, సెప్టెంబరు 24 : రాష్ట్ర కార్పెంటర్స్ వర్కింగ్ అసోసియేషన్ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.1.2 లక్షల సాయాన్ని విరాళంగా అందించారు. మంగళవారం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి నరసింహమూర్తి మాట్లాడుతూ.. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రంగబాబు, కోశాధికారి సంషీర్‌భాయ్ తదితరులతో కలిసి సీఎం రిలీఫ్ ఫండ్‌కి రూ.1,20,116ల విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారన్నారు.

62 మందికి స్క్రీనింగ్ పరీక్షలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 24 : స్థానిక జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రంలో మంగళవారం 62 మంది చిన్నారులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వీరిలో 13 మంది వినికిడి సమస్యతో బాధపడుతున్నట్టు గుర్తించామని, వారికి దీన్‌దయాల్ శ్రవణ్ ఫౌండేషన్ వారు వినికిడి పరికరాలను అందజేస్తారని డీఎంహెచ్‌ఓ కార్యాలయం తెలిపింది. వివరాలకు జిల్లా ఆసుపత్రిలోని డీఈఐసీ సెంటర్‌ను సంప్రదించాలని కోరారు.

కార్మికులకు 20 శాతం బోనస్ చెల్లించాలి

అచ్యుతాపురం, సెప్టెంబరు 24: దసరా సందర్భంగా సెజ్, ఫార్మా కర్మాగారాల్లో పనిచేసే కార్మికులకు 20 శాతం బోనస్ అక్టోబరు నెల జీతంతోపాటు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 1965 బోనస్ చట్టం ప్రకారం ప్రతి కర్మాగారంలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ బోనస్‌లు చెల్లించాలన్నారు. సమావేశంలో కె.సోమునాయుడు, ఆర్.సత్తిబాబు, నూకానాయుడు, మోటూరు అప్పలరాజు, దేశంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే బండారు



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

కె.కోటపాడు, సెప్టెంబరు 24 : ఆస్పత్రిలో వసతులు మెరుగుపరచడం ద్వారా ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందేలా కృషి చేస్తానని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ఛైర్మన్ హోదాలో విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రికి మౌలిక వసతులు, వైద్య పరికరాలు, ఇతర అభివృద్ధి కోసం నిధులు మంజూరుకు కృషి చేయనున్నట్టు చెప్పారు. సీఎస్ఆర్ నిధులతో సోలార్ విద్యుత్, ఆర్వో ప్లాంట్, అంబులెన్స్ ఏర్పాటు చేస్తామన్నారు. హెచ్‌డీఎస్ మెంబర్ అండ్ కన్వీనర్ అయిన మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సభ్యులు పూడి నారాయణమూర్తి, జూరెడ్డి చిన్నమ్మలు, రెడ్డి దేముడుబాబు, టీడీపీ మండల ప్రెసిడెంట్ రొంగలి మహేష్, దాడి ఎరుకునాయుడు, డోకల నరసింహమూర్తి, జూరెడ్డి రాము, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాతయ్యబాబుకు పదవిపై హర్షం



చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 24 : తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబుకు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి రావడంతో పార్టీలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. నియోజకవర్గం టీడీపీ నాయకులు వడ్డాది పార్టీ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మంత్రి లోకేష్‌కు జేజేలు పలికారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. పలువురు నేతలు తాతయ్యబాబుకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్నారు. 30 ఏళ్లుగా పార్టీ బలోపేతానికి పాటు పడిన తాతయ్యబాబుకు తగిన గుర్తింపు లభించిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, తెలుగు బీసీ సాధికారిత కన్వీనర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, యలమంచిలి నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు పెంటకోట విజయ్, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామూర్తి, వడ్డాది పట్టణ టీడీపీ అధ్యక్షుడు దొండా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోటకొండమ్మ అమ్మవారి పండగ



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 24 : గొలుగొండ మండలం చోద్యం గ్రామంలో మంగళవారం గ్రామదేవతైన కోటకొండమ్మ అమ్మవారి పండగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. వేకువజామున నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని కొబ్బరికాయ, అరటిపండ్లు, పసుపుకుంకుమలతో పాటు చీరలు సమర్పించారు. కొందరు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, గ్రామపెద్దలు ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి పండగ సందర్భంగా పలుసాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో అమ్మవారి బోనాలు, గరగలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్, సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, మాజీ సర్పంచ్ ఆదపురెడ్డి ప్రభాకర్‌రావు, టీడీపీ నాయకులు దేవాడ శేషు, అప్పలనాయుడు, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మూడు వేల లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

నర్సీపట్నం, సెప్టెంబరు 24 : మునిసిపాలిటీ పరిధిలోని బయపురెడ్డిపాలెం శివారులో సారా బట్టీలపై పోలీసులు దాడులు చేసి మూడు వేల లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం చేశారు. రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో ఈ దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా సారా బట్టీలో భారీగా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

మహా రచ్చ

... 5వ పేజీ తరువాయి

ప్రారంభమైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి కౌన్సిల్ సమావేశం కావడంతో వైసీపీకి చెందిన ఎక్స్‌అఫీషియో సభ్యుడు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, కుంబా రవిబాబు, పండుల రవీంద్రబాబు తోపాటు బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, జనసేనకు చెందిన దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ హాజరయ్యారు. ముందుగా ఇటీవల మరణించిన సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు సీతారాం ఏచూరి, పశ్చిమ బెంగాల్‌లో హత్యాచారానికి గురైన మెడికో మృతిపట్ల సంతాపం ప్రకటించారు. అనంతరం పలు అంశాలపై చర్చ సాగింది. మధ్యాహ్న భోజన విరామ అనంతరం టీడీపీ కార్పొరేటర్ ఒకరు నగరంలో పారిశుధ్య కార్మికుల జీతాల నుంచి ఆదాయ పన్ను పేరిట మినహాయించిన రెండు శాతం సొమ్మును కొంతమంది యూసీడీ అధికారులు, సిబ్బంది కలిసి పంచుకున్నారని, ఈ వ్యవహారంలో మేయర్‌కు కూడా ముడుపులు అందాయని ఆరోపించడంతో కౌన్సిల్ సమావేశంలో ఒక్కసారిగా దుమారం రేగింది.

సభను కుదిపేసిన యూసీడీ కుంభకోణం

వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి యూసీడీలో రూ.4.75 కోట్లు అవినీతి జరిగిందంటూ 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా ఆరోపించారు. దీనికి సంబంధించి వైసీపీ కార్యాలయం పేరుతో కొంతమంది అప్పటి రాష్ట్ర మునిసిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మికి ఫిర్యాదు చేశారంటూ ఆ ప్రతిని సభలో చదివి వినిపించారు. 2019 ఎన్నికలకు ముందు టీడీపీ ప్రభుత్వం పసుపు కుంకుమ పేరుతో ఒక్కొక్కరికి రూ.పది వేలు చొప్పున జమ చేయగా, ఇన్‌యాక్టివ్‌గా ఉన్న 1,800 గ్రూపులతో ఆర్పీల ద్వారా కొత్తగా అకౌంట్ ఓపెన్ చేయించి రూ.95 లక్షలు యూసీడీ అధికారులు కాజేశారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 'ఆసరా' పథకం కింద మహిళా సంఘాలకు డబ్బులు ఇస్తే, జీవీఎంసీ పరిధిలోని 20 వేల గ్రూపుల్లో ఉన్న రెండు లక్షల మంది సభ్యుల నుంచి రూ.వంద చొప్పున రూ.20 లక్షలు యూసీడీ సిబ్బంది వసూలు చేశారని ఆరోపించారు. కొవిడ్ సమయంలో మాస్కులు కొనుగోలు పేరుతో నగరంలో లేని మహిళా ఆర్పీ ఖాతాకు రూ.ఐదు లక్షలు బదిలీ చేశారని ఆరోపించారు. వైసీపీ నేతల పిక్నిక్ పేరుతో వెయ్యి మంది ఆర్పీల నుంచి రూ.వెయ్యి చొప్పున వసూలు చేశారని ఆరోపించారు. అలాగే మహిళా సంఘాల ఆడిట్ పేరుతో కొంత, పారిశుధ్య కార్మికుల వేతనాల నుంచి ఐటీ పేరుతో కోత పెట్టిన రెండు శాతం మొత్తం కలిపి దాదాపు రూ.4.75 కోట్లు కుంభకోణం జరిగిందని ఆరోపించడంతో సభలో కలకలం రేపింది. దీనిలో మేయర్‌తోపాటు అప్పటి కమిషనర్‌కు కూడా వాటాలు ఉన్నాయని, అందువల్లే రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించినా తొక్కిపడేశారంటూ మరో ఫిర్యాదు వెళ్లిందని రాపర్తి కన్నా ఆరోపించారు. దీంతో కూటమి సభ్యులతోపాటు సీపీఐ, సీపీఎం సభ్యులు కూడా మేయర్ రాజీనామా చేసి విచారణకు సహకరించాలని పట్టుబట్టారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. పోడియంను సభ్యులు చుట్టుముట్టి రాజీనామా చేయాలని డిమాండ్ చేయడంతో ఏం చేయాలో పాలుపోక మేయర్ సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించి సమావేశం నుంచి వెళ్లిపోయారు.

హామీల అమలుతో ప్రభుత్వానికి మంచి పేరు

» 'ఇది మంచి ప్రభుత్వం'లో చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు కేఎస్ఎన్ఎస్ రాజు, సత్యనారాయణమూర్తి

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 24 : సీఎం చంద్రబాబుతోనే సమగ్రాభివృద్ధి సాధ్యపడుతుందని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పేర్కొన్నారు. మంగళవారం వడ్డాదిలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే.. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబుతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో ప్రజలు హాయిగా జీవిస్తున్నారన్నారు. నియోజవర్గ పరిశీలకులు మూర్తి యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాలకు ఉపయోగపడే మంచి ప్రభుత్వం ఇది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, తెలుగు యువత ఉపాధ్యక్షుడు శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, టీడీపీ వడ్డాది పట్టణ అధ్యక్షుడు దొండా నరేష్, కూటమి నాయకులు గోకివాడ కోటేశ్వరరావు, దాడి సూర్యనాగేశ్వరరావు, దొండా గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



బుచ్చెయ్యపేట : ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు తదితరులు



కె.కోటపాడు : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు, వేదికపై పలువురు నేతలు, అధికారులు

కె.కోటపాడు : మండలంలోని ఏ.కోడూరు, సింగన్నదొరపాలెంలో మంగళవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం'లో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చుతుండడం వల్లే కూటమి ప్రభుత్వానికి మంచి పేరు వచ్చిందన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు అలవర్చుకోవాలని కేవలం వరి పంట కాకుండా వాణిజ్య పంటలపై ఆసక్తి చూపాలన్నారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నేతలు పైలా ప్రసాదరావు, రొంగలి మహేష్, డోకల నరసింహమూర్తి, దాడి ఎరుకునాయుడు, పూడి నారాయణమూర్తి, బొడ్డు అక్కునాయుడు, బీజేపీ మండల ప్రెసిడెంట్ కొటాన ఈశ్వరరావు, జనసేన జనరల్ సెక్రటరీ కుంచ అంజిబాబు, మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్, ఎంఈవో డీవీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'లో రైతులకు సస్యరక్షణపై అవగాహన

నర్సీపట్నం రూరల్ : మండలంలోని ధర్మసాగరం, ఓఎల్ పురం గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆర్డీవో జయరాం, జెడ్పీటీసీ సుకల రమణమ్మ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఏడీ శ్రీదేవి, వ్యవసాయ శాస్త్రవేత్త ఎన్.రాజ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి అప్పారావు పాల్గొన్నారు.

చోడవరం, సెప్టెంబరు 24 : మండలంలోని రేవళ్ల గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల పొలాలను వ్యవసాయ, జలవనరులు, పశుసంవర్ధక శాఖల అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల పంటల సమస్యలపై వ్యవసాయశాఖ ఏడీ రవీంద్రనాథ్ తదితరులు రైతులకు అవగాహన కల్పించారు. సాగునీటి కాల్వల సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టిలో తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని జలవనరుల శాఖ అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏవో పావని, సిబ్బంది కిరణ్, జలవనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

గొలుగొండ : ఖరీఫ్ సాగులో రైతులు ఎరువుల వాడకం తగ్గించాలని వ్యవసాయాధికారి సుధారాణి రైతులకు సూచించారు. తొలుతగా మండల కేంద్రం సమావేశ మందిరంలో రైతులతోమంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్‌తో పాటు ఈ కెవైసీ తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం పాతమల్లంపేటలో ఖరీఫ్ వరిపైరు వద్ద రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.అప్పలనాయుడు, నేతలు సీహెచ్ సాంబమూర్తి, గెడ్డం నానాజీ, గొల్లి సత్తిబాబు, సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మిరైతులు పాల్గొన్నారు.



మాడుగుల రూరల్ : రైతులకు అవగాహన కలిగిస్తున్న ఏఈః వాసుదేవరావు తదితరులు

నాతవరం : మండల వ్యవసాయాధికారి శైలజ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రైతుసేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఏవో శైలజ మాట్లాడుతూ రైతులు ప్రత్యేక పద్ధతులు, సూచనలు అందించడం ద్వారాఅధిక దిగుబడులు సాధించవచ్చాన్నారు. రైతులకు నానో యూరియా, నానో డీఏపీ డ్రోన్ ద్వారా పిచికారి చేయడం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ ఛైర్మన్ పారుపల్లి కొండబాబు, ఎస్.విజయ్‌కుమార్ అపిరెడ్డి మాణిక్యంమండల తెలుగురైతు అధ్యక్షుడు పైల సూరిబాబు, పీఏసీఎస్ అధ్యక్షులు శెట్టి సత్యనారాయణ, ఎఫ్‌పీవో డైరెక్టర్ చింతకాయల శ్రీను, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

రోలుగుంట : వరి పంటకు వచ్చే చీడపీడల నివారణపై రైతులు తగిన అవగాహన పెంచుకుని తగిన నివారణ చర్యలు చేపడితే అధిక దిగుబడులను సాధించవచ్చని నర్సీపట్నం ఏడీఏ శ్రీదేవి సూచించారు. మంగళవారం మండలంలోని జేపీ అగ్రహారం, రొంగలిపాలెం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు సాగులో ఆధునిక పద్ధతులను అవలంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేవీకే శాస్త్రవేత్తలు సత్తిబాబు, రాజ్‌కుమార్‌లు ట్రేలలో కూరగాయల నారు పెంపకం, లింగాకర్షక ఎరలు వాడకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో విజయలక్ష్మి, గ్రామ మాజీ సర్పంచ్ రొంగలి రమణ, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ : శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం సాధించవచ్చని కొండెంపూడి శాస్త్రవేత్త బాబు అన్నారు. 'పొలం పిలుస్తోంది'లో భాగంగా చీడికాడ, చుక్కపల్లి గ్రామాల్లో రైతుల పొలాలను మంగళవారం పరిశీలించిన అధికారులు తెగుళ్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారి రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : వరిపంటకు ఆశించే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి వాసుదేవరావు అన్నారు. మంగళవారం వమ్మలి, సత్యవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వరిపంటలను పరిశీలించి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు లక్ష్మి, సింహాచలంనాయుడు, నందారపు సన్యాశిరావు, సూర్యనారాయణ, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన స్కూలు క్రీడా పోటీలు



చీడికాడ : కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు



కృష్ణాదేవిపేట : వివిధ క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

చీడికాడ, సెప్టెంబరు 24 : మండలంలోని చుక్కపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరుగుతున్నమండల స్థాయి క్రీడా పోటీలు మంగళవారం మధ్యాహ్నంతో ముగిశాయి. అండర్-17 కబడ్డీలో అప్పలరాజుపురం హైస్కూల్ ప్రథమం, ఖో-ఖోలో తురువోలు హైస్కూల్ ప్రథమ స్థానం దక్కించుకున్నారు. వాలీబాల్‌లో కోనాం గిరిజన ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థులు మొదటిస్థానంలో నిలిచారు. అలాగే అండర్-14 విభాగంలో కబడ్డీ అండ్ ఖో-ఖో తురువోలు హైస్కూల్ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. వాలీబాల్‌లో అప్పలరాజుపురం హైస్కూల్ విద్యార్థులు మొదటిస్థానం దక్కించుకున్నారు. షటిల్ బ్యాడ్మింటన్‌లో వరహాపురం హైస్కూల్‌కు ప్రథమస్థానం దక్కింది. అండర్-17 బాలికల విభాగంలో కబడ్డీ పోటీల్లో అప్పలరాజుపురం బాలికలు మొదటిస్థానం, ఖో-ఖోలో వరహాపురం బాలికలు, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్‌లో చీడికాడ కేజీబీవీ విద్యార్థులు మొదటిస్థానం దక్కించుకున్నారు. అండర్-14 బాలికల విభాగంలో కబడ్డీ దిబ్బపాలెం, ఖో-ఖో వరహాపురం, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో చీడికాడ కేజీబీవీ విద్యార్థులు మొదటిస్థానం దక్కించుకున్నారు. అండర్-14 బాలుర విభాగంలో చెస్ పోటీల్లో అప్పలరాజుపురం హైస్కూల్ మొదటిస్థానం రాగా, ద్వితీయ స్థానం చుక్కపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు దక్కించుకున్నారు. వీరందరూ ఈనెల 27న నియోజకవర్గస్థాయి పోటీలకు అర్హులవుతారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీవీ రమణ తెలిపారు.

కృష్ణాదేవిపేటలో..

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలం ఏఎల్ పురం జడ్పీ హైస్కూలులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహించిన మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు మంగళవారంతో ముగిశాయి. విజేతలకు స్థానిక సర్పంచ్ లోచల సుజాత, ఎంపీటీసీ రుత్తల రామకృష్ణ, స్కూల్ కమిటీ ఛైర్మన్ లడుగు రాజులు నాయుడు తదితలు బహుమతులు అందజేశారు. ఈ పోటీలకు మండల వ్యాప్తంగా సుమారు 500 మంది బాలబాలికలు అండర్-14, 17 విభాగాల్లో పాల్గొని కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, చెస్, అథ్లెటిక్స్ యోగా తదితర పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం నాగభూషణం, ఉపాధ్యాయులు టీవీ రమణ, లోచల రమేష్, రామ్‌కుమార్, రామరాజు, కందూర నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంటలో..

రోలుగుంట : మండలంలోని బుచ్చెంపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటారు. ఈ నెల 19 నుంచి 23వ వరకు జరిగిన పోటీల్లో అండర్-17 విభాగంలో కబడ్డీ, బ్యాడ్మింటన్, చెస్, ఖో-ఖో, డిస్కస్ త్రో, షార్ట్‌పుట్ క్రీడల్లో బాలురు ప్రథమ స్థానం సాధించారు. అలాగే అండర్-17, 14 విభాగాల్లో నిర్వహించిన పలు క్రీడల్లో బాలికలు ప్రథమ స్థానం సాధించారు. మంగళవారం హెచ్ఎం శేఖర్ ఆధ్వర్యంలో అభినందన సభను ఏర్పాటు చేసి విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ సీహెచ్ వెంకటరమణ పాల్గొన్నారు.



బహు మతులు అందుకున్న విద్యార్థులు

విధేయతకు పట్టం

... 5వ పేజీ తరువాయి

శిరోధార్యంగా భావించారు. దీంతో అధినేత చంద్రబాబు ఎన్నికల ముందు తాతయ్యబాబుకు పార్టీ జిల్లా పగ్గాలు అప్పగించారు. ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి విజయానికి ఆయన మనస్ఫూర్తిగా పనిచేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చోడవరంలో 41 వేల పైచిలుకు మెజారిటీతో తెలుగుదేశం విజయఢంకా మోగించిన విషయం తెలిసిందే. దీంతో పార్టీ పెద్దల వద్ద తాతయ్యబాబుకు గుర్తింపు మరింత పెరిగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మంగళవారం ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల తొలిజాబితాలో ఏపీ హౌసింగ్ బోర్డు ఛైర్మన్‌గా తాతయ్యబాబును నియమించారు.

సామాన్య కార్యకర్త నుంచి...

తెలుగుదేశం ఆవిర్భావం నుంచి ఆ పార్టీలోనే కొనసాగుతున్న తాతయ్యబాబు సాధారణ కార్యకర్త నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ టీడీపీ జిల్లా అధ్యక్ష స్థాయికి చేరుకున్నారు. నాలుగు దశాబ్దాల కాలంలో పార్టీ పరంగా, ప్రజా ప్రతినిధిగా పలు పదవులు చేపట్టి, సమర్థంగా నిర్వహించారు. వడ్డాది పంచాయతీ వార్డు సభ్యుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆయన పంచాయతీ సర్పంచ్‌గా, బుచ్చెయ్యపేట ఎంపీపీగా పదవులు నిర్వహించారు. టీడీపీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జిగా, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. పార్టీ కార్యక్రమాల పరిశీలకుడిగా రాష్ట్రంలో పలు జిల్లాలకు బాధ్యునిగా వ్యవహరించారు.

చంద్రబాబు నమ్మకాన్ని నిలబెడతా
- బత్తుల తాతయ్యబాబు

నా నమ్మకం ఉంచి ఏపీ స్టేట్ హౌసింగ్ బోర్డు ఛైర్మన్‌గా నియమించిన తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నమ్మకాన్ని నిలబెడతాను. పార్టీలో సామాన్య కార్యకర్తగా ప్రస్థానాన్ని ప్రారంభించిన నాకు ఈ పదవిని అధిష్ఠానం ఇచ్చిన గుర్తింపుగా భావిస్తున్నాను. నామినేటెడ్ పదవి లభించడం చాలా ఆనందంగా ఉంది. ఈ పదవిని ఒక బాధ్యతగా భావించి హౌసింగ్ బోర్డు ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తాను.

డిజిటల్ బాటలో సహకార సంఘాలు

... 5వ పేజీ తరువాయి

వెయ్యి వరకు ఉన్నాయి. మిగిలిన 1,136 సభ్యత్వాలలో ఆధార్ కార్డులు, పాస్ పుస్తకాలు జెరాక్సులు అందజేసిన రైతులు 686 మంది ఉన్నారు. మిగిలిన రైతులు ముందుకు రావడం లేదు. ఇది కంప్యూటరీకరణకు ఆటంకంగా మారింది. అక్టోబరు 2 నాటికి ఎంతవరకు అయితే అంతవరకు రికార్డులు ఆన్‌లైన్ పూర్తి చేసి డిజిటల్ సేవలు ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. రికార్డులు ఆన్‌లైన్ చేయడం వల్ల బినామీ రుణాలు, అవకతవకలకు తావులేకుండా ఉంటుందని అంటున్నారు.

రైతులకు చాలా ఉపయోగం



రికార్డుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేస్తే సహకార సంఘాలను మరింత బలోపేతం చేయాలని కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు ఆలోచన చేస్తున్నాయి. రికార్డుల డిజిటలైజేషన్ వల్ల రైతులకు పలు ప్రయోజనాలు కలుగుతాయి. పంట రుణాలే కాకుండా రాయితీపై విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్రాలు అందజేస్తారు. ప్రతి రైతూ ఆధార్ కార్డు, పాస్ పుస్తకం జెరాక్స్ అందజేయాలి.

- మరిడయ్య, పర్సన్ ఇన్‌చార్జి, చెట్టుపల్లి పీఏసీఎస్

ధర్మసాగరంలో సామూహిక సీమంతాలు



సామూహిక సీమంతల దృశ్యం

నర్సీపట్నం రూరల్, సెప్టెంబరు 24 : మండలంలోని ధర్మసాగరంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం ఎంపీడీవో ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్డీవో జయరాం ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సుకల రమణమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమమాధురి, కార్యదర్శి శేఖర్, సర్పంచ్, ఉప సర్పంచ్ పాల్గొన్నారు.

నర్సీపట్నంలో భారీ వర్షం

నర్సీపట్నం, సెప్టెంబరు 24 : నర్సీపట్నంలో మంగళవారం సాయంత్రం 6 గంటలు తర్వాత భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయమయ్యాయి. 22వ వార్డు వెంకునాయుడెపేటలో డ్రైనేజీ నీరు రోడ్డు మీద పారింది. మెయిన్ రోడ్డులో శ్రీకన్య కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్, శివపురం తదితర ప్రాంతాలలోవాహనదారలు ఇబ్బంది పడ్డారు.

దేవరాపల్లి : మండలంలోని మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి నాగయ్యపేట శివారు సీతంపేటలో పట్నాల నరసింగరావు ఇంటిలోకి నీరు చేరింది.

☛ సంక్షిప్తంగా..

చోడవరం ఎంపీడీవోగా ఆంజనేయులు



చోడవరం, సెప్టెంబరు 24 : మండల పరిషత్ అధికారిగా జి.ఆంజనేయులు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సోమవారం నిర్వహించిన బదిలీల్లోభాగంగా ఆయన శ్రీకాకుళం జిల్లా నుంచి అనకాపల్లి జిల్లాకు కేటాయించడగా, ఆయనకు చోడవరం ఎండీవోగా అధికారులు నియమించారు. ఈ నేపథ్యంలో ఆంజనేయులు ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. గతంలో స్థానిక మేజర్ పంచాయతీ ఈవోగానూ, మండల పరిషత్‌లో ఈవోపీఆర్డీగానూ ఆంజనేయులు పని చేశారు.

ఎంపీడీవోగా పార్ధసారథి



పార్ధసారిథికి అభినందనలు తెలుపుతున్న టీడీపీ నేతలు

నాతవరం, సెప్టెంబరు 24 : నాతవరం నూతన ఎంపీడీవోగా మంగళవారం పి.పార్ధసారధి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన హనుమంతరావు భీమిలికి బదిలీపై వెళ్లారు. నాతవరం మండల పరిషత్ కార్యాలయంలో ఏవోగా పని చేసిన పార్ధసారధికి ఎంపీడీవో బాధ్యతలు అప్పగించారు.

ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ సభ్యుడు కరక సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మాజీ ఎంపీపీలు ఎస్.విజయ్‌కుమార్, తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ ఛైర్మన్ పారుపల్లి కొండబాబు నూతన ఎంపీడీవోకు అభినందనలు తెలిపారు.

కె.కోటపాడు ఎంపీడీవోగా సాంబశివరావు



కె.కోటపాడు, సెప్టెంబరు 24 : కె.కోటపాడు ఎంపీడీవోగా ఎ.ఎ. సాంబశివరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పాయకరావుపేట నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

తహసీల్దారుగా భాగ్యవతి



కె.కోటపాడు, సెప్టెంబరు 24 : కె.కోటపాడు తహసీల్దార్‌గా పసనల భాగ్యవతి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇప్పటి వరకూ పని చేసిన రమేష్‌బాబు.. ఎస్.రాయవరం తహసీల్దారుగా బదిలీపై వెళ్లారు. అనంతరం తహసీల్దార్ భాగ్యవతి.. డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్‌తో కలిసి మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు.

రావికమతం తహసీల్దార్‌గా బీవీ రమణ



రావికమతం రావికమతం, సెప్టెంబరు 24 : రావికమతం తహసీల్దార్‌గా బాణం వెంకటరమణ బాధ్యతలు చేపట్టారు. ఈయన శ్రీకాకుళం జిల్లాలోని హిరమండలం నుంచి ఇక్కడకు వచ్చారు. మాడుగుల మండలం జాలంపల్లి ఈయన స్వగ్రామం. కాగా, ఇంత వరకూ ఇక్కడ పని చేసిన ఎస్‌పే మహేశ్వరావును మునగపాక మండలం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వెంకటరమణకు రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు.

కుమార్తె వల్లే ఇంటికి గుర్తింపు


» టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతాయ్యబాబు



కార్యక్రమంలో పాల్గొన్న తాతయ్యబాబు తదితరులు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 24 : కుమార్తె ప్రతిభాసామర్థ్యాలుఇంటికి వెలుగని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అన్నారు. ఆయన మంగళవారం వడ్డాదిలో అతిథిదేవోభవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కుమార్తెల దినోత్సవంలో మాట్లాడుతూ.. అన్ని రంగాల్లోనూ ఆడపిల్లలు సాధిస్తున్న విజయాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా రోగనిరోధక శక్తి హోమియో మందులను తాతయ్యబాబు పంపిణీ చేశారు.సంస్థ కార్యదర్శి ఆరిపాక కామేశ్వరరావు, వడ్డాది పట్టణ టీడీపీ అధ్యక్షుడు దొండా నరేష్, టీడీపీ నాయకులు తలారీ శంకరావు, ఏ.కనకరాజు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎస్ఎస్ దినోత్సవం



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కిరణ్

చోడవరం, సెప్టెంబరు 24 : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ ఎస్ఎస్ఎస్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ పి.కిరణ్ జాతీయ ఎన్ఎస్ఎస్ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు.కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ పీవోలు మాల్యాద్రి, రత్నప్రభ, పిచ్చమ్మ, లెక్చరర్లు సత్యవతి, రఫియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'పై సమీక్ష



మాట్లాడుతున్న సర్పంచ్ బాబూరావు

దేవరాపల్లి, సెప్టెంబరు 24 : ఉపాధి హామీ పథకంతో జరిగిన అభివృద్ధి పనులపై అందరికీ తెలియడంతోపాటు ప్రజలకు అవసరమైన పనులు మాత్రమే గుర్తించాలని సర్పంచ్ బాబూరావు అన్నారు. మంగళవారం గ్రామంలో ఉపాధి పనులపై జరిగిన అభివృద్ధిని ప్రజలకు వెల్లడించారు. కార్యదర్శి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

పూరింటికి నిప్పంటించిన వ్యక్తిపై కేసు నమోదు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 24: మండలంలోని ఉప్పరాపల్లి గ్రామంలో ఒక పూరింటికి నిప్పంటించిన వ్యక్తిపై కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. ఉప్పరాపల్లిలో సేనాపతి ఆదిలక్ష్మికి చెందిన ఖాళీగా వున్న పూరింటికి అదే గ్రామానికి చెందిన సేనాపతి నూకరాజు అనే వ్యక్తి మంగళవారం తెల్లవారుజామున నిప్పు అంటించాడు. దీంతో ఇల్లు మొత్తం కాలిపోయింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంతోపాటు ఇంటిలో భద్రపరిచిన పలు వస్తువులు దగ్ధమయ్యాయి. నూకరాజు మద్యం మత్తులో పూరింటికి నిప్పు పెట్టినట్టు స్థానికులు చెప్పడంతో ఆదిలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సేనాపతి నూకరాజుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

- మరొకరికి గాయాలు
- తాటిచెట్లపాలెం జంక్షన్ సమీపంలో డివైడర్‌ను ఢీకొన్న బైక్

విశాఖపట్నం, సెప్టెంబరు 24 : జాతీయ రహదారిపై తాటిచెట్లపాలెం జంక్షన్ సమీపంలో మంగళవారం ఉదయం ఆరు గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. సీతంపేట ప్రాంతానికి చెందిన ప్రవీణ్ (24), దొండపర్తికి చెందిన ప్రశాంత్ (22), కంచరపాలేనికి చెందిన మహేష్ (20) స్నేహితులు. వీరు ముగ్గురూ ఉదయం స్థానిక ఊర్వశి జంక్షన్ నుంచి ద్విచక్ర వాహనంపై తాటిచెట్లపాలెం వైపు బయలుదేరారు. తాటిచెట్లపాలెం జంక్షన్‌కు కొద్దిగా ముందు సంజీవయ్యనగర్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న ప్రవీణ్ (24), మధ్యలో కూర్చున్న ప్రశాంత్ (22) అక్కడికక్కడే మృతిచెందారు. వెనుక కూర్చున్న మహేష్(20)కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరధి ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కేజీహెచ్‌కు తరలించారు. సీఐ దాశరధి నేతృత్వంలో ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతులు ప్రవీణ్, ప్రశాంత్ (ఫైల్ ఫొటోలు)

తల్లిదండ్రులను ట్రైన్ ఎక్కించి...

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ప్రవీణ్ రిటైర్డు ఆర్మీ ఉద్యోగి లక్ష్మణరావు కుమారుడు. వీరు సీతంపేట గణేష్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఊరు వెళుతున్న తల్లితండ్రిని ప్రవీణ్ ట్రైన్ ఎక్కించి, దొండపర్తిలో నివాసం ఉంటున్న స్నేహితుడు ప్రశాంత్‌ను తన బైక్‌పై తీసుకుని కంచరపాలెంలో ఉంటున్న మహేష్ వద్దకు వచ్చాడు. అక్కడ నుంచి ముగ్గురూ సీతంపేటలోని ప్రవీణ్ ఇంటికి బయలుదేరారు. సరిగ్గా సంజీవయ్య కాలనీ దగ్గరకి వెళ్లేసరికి వాహనం అదుపుతప్పి ప్రమాదం చోటుచేసుకుంది. ప్రవీణ్ బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ప్రశాంత్ ఇంటర్ మధ్యలో ఆపేశాడు. గాయపడిన మహేష్ పెందుర్తి సమీపంలో గల వెల్ఫేర్ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు.

'సాంకేతిక పరిజ్ఞానం రైతులకు చేరువ కావాలి'

అచ్యుతాపురం, సెప్టెంబరు 24: వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం రైతులకు దగ్గరవడానికి పొలం పిలుస్తోంది కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా ఉద్యానవన శాఖాధికారి జి.ప్రభాకరరావు అన్నారు. మంగళవారం కొండకర్ల, హరిపాలెంలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రైతులందరూ అధికారుల సూచనలు పాటించి, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలన్నారు. అలాగే ఉద్యాన శాఖ నుంచి డ్రిప్, స్ప్రింక్లర్లు పరికరాలు 90 శాతం సబ్సిడీతో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి మంగళ, బుధవారాల్లో రోజుకు రెండు గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి శంకర్ గోవింద, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి తులసీమణి, ఏఈఓ కేబీ సూర్యనారాయణ, వీపీఏలు రాజకుమార్, ఆర్.లోకేష్ పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఏర్పాటు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 24 : విశాఖ ఉక్కు పరిరక్షణకు పోరాట కమిటీ ఏర్పాటైంది. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జిల్లా ప్రధానకార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీని నియమించారు. కమిటీ జిల్లా కన్వీనర్‌గా ఆర్.దొరబాబు, కో-కన్వీనర్‌గా ఆర్. శంకరరావు, కమిటీ సభ్యులుగా కర్రి అప్పారావు, రెడ్డి అప్పలరాజు, గాడి బాలు, ఎం.రమణ, డీడీ వరలక్ష్మి, పి.మాణిక్యం, జి.కోటేశ్వరరావు, కె.శంకరరావులతో కమిటీ ఏర్పడిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు తెలిపారు. ఉక్కు పరిరక్షణకు అక్టోబరు రెండో తేదీ నుంచి నాల్గో తేదీ వరకు రిలే నిరాహారదీక్షలు చేపట్టనున్నామన్నారు.

జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీలకు కేతన్‌సాయికౌశిక్ ఎంపిక

సీలేరు, సెప్టెంబరు 24 : జీకేవీధి మండలం సీలేరుకు చెందిన ఎం.కేతన్‌సాయికౌశిక్ జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల విజయవాడలో జరిగిన ఎస్‌జీఎఫ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ప్రతిభను కనబరిచి వచ్చే నెలలో లడఖ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరఫున అర్హత సాధించాడు. సీలేరులో ఏపీ జెన్‌కో ఉద్యోగి ఎం.జోగారావు కుమారుడైన ఎం.కేతన్‌సాయికౌశిక్ విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఎంపీసీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్- 19 విభాగంలో విశాఖపట్నం జిల్లాలో టేబుల్ టెన్నిస్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ నెల 19 నుంచి 22 వరకు విజయవాడల్లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో విశాఖ జిల్లా తరఫున ఆడి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు.



కేతన్‌సాయికౌశిక్

కొత్త జిల్లాలకు సూపరింటెండెంట్ ఇంజనీర్లు

- ఏపీఈపీడీసీఎల్ ఉత్తర్వులు

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాలకు సూపరింటెండెంట్ ఇంజనీర్ల (ఎస్ఈ)ను నియమిస్తూ ఏపీఈపీడీసీఎల్ ఉత్తర్వులు జారీచేసింది. కొత్త జిల్లాల్లో కలెక్టరేట్ సహా, ఇతర శాఖలకు ప్రత్యేక కార్యాలయాలు ఏర్పాటైనప్పటికీ విద్యుత్ పంపిణీ సంస్థలు మాత్రం ఉమ్మడి జిల్లా కేంద్రంగానే ఇన్నాళ్లు కార్యకలాపాలు నిర్వహించాయి. జిల్లా కలెక్టర్లు సమావేశాలు నిర్వహించినప్పుడు ఒక ఎస్ఈనే ఆ జిల్లాకు, ఈ జిల్లాకు తిరగడం ఇబ్బందిగా మారడంతో తప్పనిసరిగా ఎస్ఈలను నియమించాలని నిర్ణయించారు. ప్రస్తుతం ప్రభుత్వం బదిలీలకు అవకాశం కల్పించడంతో అందుబాటులో ఉన్నవారినే కొత్త జిల్లాలకు ఎస్ఈలుగా నియమించారు. వారికి సహాయంగా ఒక డిప్యూటీ ఇంజనీర్ (టెక్నికల్), ఇద్దరు ఏఈలు, ఇద్దరు జూనియర్ ఇంజనీర్లు, అకౌంటింగ్ అధికారులు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను ఇచ్చారు. ఇలా మొత్తం 12 మందితో సర్కిల్ కార్యాలయం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అనకాపల్లి జిల్లా సర్కిల్ ఎస్ఈగా గొప్పు ప్రసాద్, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ సర్కిల్ ఎస్ఈగా ఎస్.రాజాబాబు, పార్వతీపురం మన్యం సర్కిల్ ఎస్ఈగా కె.చలపతిరావు, అల్లూరి సీతారామరాజు సర్కిల్ ఎస్ఈగా జీఎస్ ప్రసాద్, కాకినాడ ఎస్ఈగా గొర్లె ప్రసాద్‌లను నియమించారు.

నేటి నుంచి మునగపాకలో రాష్ట్ర స్థాయి మహిళల కబడ్డీ పోటీలు

విశాఖపట్నం, సెప్టెంబరు 24: అనకాపల్లి జిల్లా మునగపాకలో మరిడిమాంబ జాతర సందర్భంగా బుధవారం నుంచి రాష్ట్ర స్థాయి మహిళల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు విద్యుద్దీప కాంతుల్లో మ్యాట్‌పై నిర్వహించే ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచే జట్టుకు రూ.25 వేలు, ద్వితీయ స్థానానికి రూ.20 వేలు, మూడు, నాలుగు సానాల్లో నిలిచే జట్లకు రూ.15 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులను అందజేస్తామన్నారు. వివరాలకు 7680005666 సెల్ నంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

అప్పులకుప్పగా రాష్ట్రం

రాజకీయాన్ని వ్యాపారంగా మార్చేశారు

- చివరకు శ్రీవారి ప్రసాదాన్నీ వదలలేదు
- మాజీ సీఎం జగన్‌పై మంత్రి అనిత ధ్వజం
- చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధిబాటలో నడిపిస్తున్నారని కితాబు



'ఇది మంచి ప్రభుత్వం' సభలో మాట్లాడుతున్న మంత్రి వంగలపూడి అనిత

కోటవురట్ల, సెప్టెంబరు 24: జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చేయగా, సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధిబాటలో నడిపిస్తున్నారని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. కోటవురట్ల మండలం వీకేపల్లిలో మంగళవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ, గత సీఎం జగన్‌రెడ్డి రాజకీయాన్ని వ్యాపారంగా మార్చేశారని, చివరకు తిరుమల వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని కూడా వదలిపెట్టలేదని ధ్వజమెత్తారు. వైసీపీ పాలనలో చేసిన పాపాలను కప్పిపుచ్చుకునేందుకు కూటమి ప్రభుత్వంపై దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని ఆమె విమర్శించారు. కాసులకు కక్కుర్తిపడి శ్రీవారి లడ్డూప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యిని వినియోగించారని మంత్రి ఆరోపించారు. గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని, ఆడపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడితే ముద్దాయిలకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



సభకు హాజరైన ప్రజలు

కోటవురట్ల మండలంలో వరహా నదిపై జల్లూరు, పందూరుల వద్ద గత టీడీపీ హయాంలో వంతెనల నిర్మాణ పనులుచేపట్టగా, తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు ఐదేళ్లపాటు పనులు చేయకుండా గాలికొదిలేశారని మంత్రి అనిత విమర్శించారు. టీడీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన తరువాత వంతెన పనులను పునరుద్ధరించామని చెప్పారు. వైసీపీ హయాంలో చేసిన కొద్దిపాటి అభివృద్ధి పనులకు కూడా బిల్లులు చెల్లించలేదని, ఇప్పుడు ఆ బిల్లులను తమ ప్రభుత్వం చెల్లిస్తున్నదని చెప్పారు. పీకేపల్లిలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీఇచ్చారు. అంతకుముందు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను మంత్రి తిలకించారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ దీపిక, టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి లాలంకాశీనాయుడు, మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, కూటమి పార్టీల నేతలు తోట నగేశ్, కొప్పిశెట్టి వెంకటేశ్, అబ్బం, పెట్లలింగం నాయుడు, శ్రీనివాసరావు, మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ, తహసీల్దార్ జానకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేవల్‌బేస్ నిర్వాసితులకు మేలు చేద్దాం

- ఎన్ఏవోబీ నిర్వాసితుల సమావేశంలో హోం మంత్రి అనిత



నేవల్‌బేస్‌కు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, సెప్టెంబరు 24: ఎన్ఏవోబీ కోసం భూములిచ్చిన వాకపాడు, బంగారమ్మపాలెం, వాతాడ గ్రామాల నేవల్‌బేస్ నిర్వాసితులకు అన్నివిధాల మేలు చేయాలని, మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం తన నివాసంలో ఎన్ఏవోబీ నిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణణ్, ఎస్పీ దీపిక, ఇతర అధికారులు పాల్గొన్నారు. తొలుత నిర్వాసిత మత్స్యకారులు మాట్లాడుతూ దేశరక్షణ కోసం తాము భూములను ఇచ్చామని, తమ జీవనోపాధికి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించి, జెట్టీ నిర్మించాలని కోరారు. గతంలో బంగారమ్మపాలెం మత్స్యకారులపై పెట్టిన కేసుల నుంచి ఉపశమనం కలిగించాలని కోరారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ బంగారమ్మపాలెం గ్రామస్థులపై గతంలో వున్న కేసులను పరిశీలించి, సాధ్యమైనంత వరకూ వారికి న్యాయం చేయాలని ఎస్పీ దీపికకు సూచించారు.

మత్స్యకారులకు ఇబ్బంది లేకుండా తదుపరి చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు. బంగారమ్మపాలెంలో కల్వర్టులు నిర్మిస్తామని చెప్పారు. ఎన్ఏవోబీ నిర్వాసితుల సమస్యలపై మరోసారి అధికారులతో విస్తృత సమావేశం నిర్వహించాలని ఈ గ్రామాల ప్రజలు హోం మంత్రిని కోరారు.

పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యం

- ఆర్డీవో చిన్నికృష్ణ

పరవాడ, సెప్టెంబరు 24 : ఫార్మా పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ సూచించారు. ఫార్మాసిటీలోని ఎంఏఎస్ఆర్ఎం సమావేశమందిరంలో మంగళవారం ఫార్మా ప్రతినిధులు, ఉద్యోగులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాజమాన్యాలు భద్రతపై దృష్టి సారించాలన్నారు. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా పరిశ్రమలో జరిగిన ప్రమాదం వంటివి పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగితే వెంటనే పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారమివ్వాలన్నారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ మాట్లాడుతూ పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు సేఫ్టీ ఆడిట్‌లు నిర్వహించడంతో పాటు భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ పి.చిన్నారావు, జెఎన్‌పీసీ అసోసియేషన్ కార్యదర్శి జెట్టి సుబ్బారావు, వాకా చంద్రశేఖరరెడ్డి, హనుమంతు లక్ష్మణరావు, బి. రాకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ దీక్షకు మద్దతుగా పాదయాత్ర

- జనసేన రాష్ట్ర కార్యదర్శి శివదత్

నక్కపల్లి, సెప్టెంబరు 24: తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ విషయమై తీవ్ర ఆవేదన చెందిన ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు మద్దతుగా తాము పాదయాత్ర చేపట్టాలని నిర్ణయించినట్టు జనసేన రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ చెప్పారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. 28వ తేదీ ఉదయం పాయకరావుపేట పాండురంగస్వామి దేవస్థానం నుంచి ఉపమాక వేంకటేశ్వరస్వామి దేవస్థానం వరకూ జనసైనికులతో కలిపి పాదయాత్ర చేపడతానన్నారు.

తిరుమల పవిత్రతను నాశనం చేసిన వైసీపీ పాలక మండళ్లు

- ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



శిబిరం వద్ద మాట్లాడుతున్న కొణతాల

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 24 : వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల హయాంలో తిరుమల పవిత్రతను ఆ పార్టీ పాలకమండళ్లు నాశనం చేశాయని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. స్థానిక నెహ్రూ చౌక్‌లో మంగళవారం నిర్వహించిన ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా ఆయన మాట్లాడారు. పవిత్రమైన శ్రీవారి లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యిను కూడా కల్తీ చేయించిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. లడ్డూ ప్రసాదంలో అవినీతికి పాల్పడిన వారిని శిక్షిస్తామన్నారు. ఇటువంటి సంఘటనలకు పాల్పడిన వారిని విడిచిపెట్టరాదన్నారు. తిరుమల లడ్డూ అంటే ప్రపంచ దేశాల్లో ఎంతో ఖ్యాతి ఉందన్నారు. కల్తీ నెయ్యి వ్యవహారం ఒక మతానికి సంబంధించినది కాదని అనాదిగా వస్తున్న ఆచార వ్యవహారాలకు సంబంధించిన అంశమన్నారు. జగన్ హయాంలో జరిగిన మద్యం అమ్మకాలపై కూడా విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, కూటమి నాయకులు ఆళ్ల రామచంద్రరావు, దూలం గోపి, మళ్ల సురేంద్ర, కాయల మురళీ, తాడి రామకృష్ణ, సతీష్, మళ్ల శ్రీను, పచ్చికూర రాము తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల పెంపకందారులకు సహకారం

- ఉపాధి పథకం కింద షెడ్లు మంజూరు
- పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి రామ్మోహనరావు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 24: గొర్రెలు, మేకల పెంపకందారులకు ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తామని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ రామ్మోహనరావు అన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార యూనియన్ సర్వసభ్య సమావేశం జిల్లా చైర్మన్ గంటా శ్రీరామ్ అధ్యక్షతన మంగళవారం స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామ్మోహనరావు మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం కింద మొదటి దఫాలో ప్రతి మండలానికి 25 చొప్పున గొర్రెల షెడ్లు మంజూరు చేస్తామని చెప్పారు. అక్టోబరు, జనవరి, ఏప్రిల్ నెలల్లో జిల్లాలోని అన్ని గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేయడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. చైర్మన్ గంటా శ్రీరామ్.. గత ఆరు నెలల కార్యకలాపాలను సమావేశంలో వివరించారు. పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ శీనుబాబు, పశువైద్యాధికారి భానుమూర్తి, గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార యూనియన్ జిల్లా వైస్ చైర్మన్ సబ్బి శ్రీనివాసరావు, మాజీ చైర్మన్ దేవర సత్యనారాయణ, పినబోయిన అప్పారావు, గోకాడ దేముడునాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహనరావు

జాతీయ టెన్నికాయిట్ పోటీలకు రాష్ట్ర జట్లు రెడీ

- బాలురు, బాలికలకు ముగిసిన శిక్షణ
- 30 నుంచి వచ్చే నెల 4 వరకు జమ్ములో పోటీలు



జాతీయ టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర బాలురు, బాలికల జట్లు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 24: జమ్ము-కశ్మీర్ రాష్ట్రంలోని జమ్ములో సెప్టెంబరు 30వ తేదీ నుంచి అక్టోబరు నాలుగో తేదీ వరకు జరిగే 36వ జాతీయ సబ్ జూనియర్ బాలురు, బాలికల టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల శిక్షణ మంగళవారంతో ముగిసింది. స్థానిక మహాత్మాజ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 16వ తేదీ నుంచి శిక్షణ ఇస్తున్నట్టు టెన్నికాయిట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైడీ రామారావు, కేఎన్‌వీ సత్యనారాయణలు తెలిపారు. ఈ పోటీల్లో బాలికల విభాగంలో కె.జ్యోతిక, హెచ్.స్పందన, హెచ్.దీక్షిత (అనంతపురం), ఆర్.సంస్కృతి (పశ్చిమగోదావరి), కె.ఇందు (విజయనగరం), పి.శ్రావణ (శ్రీకాకుళం); బాలుర విభాగంలో ఎస్.గౌతమ్‌సంజయ్ (అనంతపురం), ఎస్.సాయికుమార్ (విజయనగరం), కె.శివశంకర్ ప్రసాద్ (తూర్పుగోదావరి), జి.మహీధర్ (అనంతపురం), బి.సత్యనారాయణ (తూర్పుగోదావరి), డి.రోహిత్ (విశాఖపట్నం) పాల్గొంటారని తెలిపారు. అసోసియేషన్ కోచ్ జి.రాజు, వ్యాయామ ఉపాధ్యాయుడు మదన్, అంతర్జాతీయ టెన్నికాయిట్ క్రీడాకారుడు పీజేఎండీ రామారావు, వి.వినయ్‌కుమార్, యల్లపు గోవింద, పి.రమణారావు శిక్షణ ఇచ్చారన్నారు.

సీఎంఆర్ఎఫ్‌కు అయ్యన్న విద్యాసంస్థలు రూ.1.5 లక్షల విరాళం



ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి విరాళం అందజేస్తున్న అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టర్ కాశీం

కె.కోటపాడు, సెప్టెంబరు 24: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ముందుకు వచ్చిన అయ్యన్న విద్యాసంస్థల యాజమాన్యం అభినందనీయమని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. సీఎం సహాయ నిధికి అయ్యన్న విద్యాసంస్థల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ఒక లక్షా 53 వేల 650 రూపాయలు విరాళంగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి అందజేశారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ చదువు ఒక్కటే కాకుండా వివిధ సేవా కార్యక్రమాలతో పాటు బాధితులకు అండగా నిలవడం అయ్యన్న విద్యాసంస్థలు అభినందనీయమని కరస్పాండెంట్ కాశీంను అభినందించారు. ఈ కార్యక్రమంలో నన్నయ్య యూనివర్సిటీ విశ్రాంత ఉపకులపతి ముర్రు ముత్యాలనాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు, బీజేపీ నాయకులు చల్లా సత్యనారాయణమూర్తి, టీడీపీ మండల ప్రెసిడెంట్ రొంగలి మహేష్, బత్తి రమణ, డోకల నరసింహమూర్తి, పూడి నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో శాంతి హోమం



సింహాచలం దేవస్థానంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న రుత్వికులు

- దోష నివృత్తికి చర్యలు

సింహాచలం, సెప్టెంబరు 24: రాష్ట్రంలోని పలు దేవాలయాల్లో ప్రసాదాల తయారీలో చోటుచేసుకున్న దోషాల నివృత్తికి తగిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు మంగళవారం సింహాచలంలోని వరాహ లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో శాంతిహోమం నిర్వహించారు. హోమంలో ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పీవీజీఆర్ నాయుడు (గణబాబు), పంచకర్ల రమేశ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో మహా సంప్రోక్షణ

సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కూడా ప్రసాదాల తయారీకి నాణ్యత లేని నెయ్యి వాడినట్టు ప్రాథమికంగా నిర్ధారించిన తరుణంలో ఆ అపచార పరిహారార్థం మంగళవారం మహా సంప్రోక్షణ గావించారు. ఆలయ పరిసరాలు, ప్రసాదాల తయారీకి కావలసిన ముడి సరకులు నిల్వ ఉంచే ప్రధాన స్టోర్స్ ప్రసాదాలు తయారుచేస్తున్న పొయ్యిలను ప్రోక్షణ చేశారు.

నేడు మంత్రి నారా లోకేశ్ విశాఖ రాక



విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ బుధవారం నగరానికి రానున్నారు. ఆయన ఉదయం ఎనిమిది గంటలకు విజయవాడ నుంచి విమానంలో బయలుదేరి 8.50 గంటలకు విశాఖపట్నం వస్తారు. విమానాశ్రయం నుంచి నేరుగా నోవాటెల్ హోటల్‌కు చేరుకుని సీఐఐ సదస్సుకు హాజరవుతారు. మధ్యాహ్నం మూడు గంటల వరకూ అక్కడే ఉంటారు. అనంతరం మధురవాడ వెళ్లి అదానీ గ్రూపునకు డేటా సెంటర్ ఏర్పాటునిమిత్తం కేటాయించిన కొండను సందర్శిస్తారు. సాయంత్రం 4.45 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి 5.20 గంటలకు పార్టీ కార్యాలయానికి చేరుకుని నాయకులు, కార్యకర్తలను కలుస్తారు. కాగా ఈనెల 26వ తేదీన కూడా లోకేశ్ పలు కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంది. అయితే దీనికి సంబంధించి అధికారికంగా ఎటువంటి సమాచారం రాలేదు. మంత్రి లోకేశ్ మంగళవారం రాత్రికి నగరానికి రావల్సి ఉంది. అయితే విజయవాడలో పలు కార్యక్రమాల్లో బిజీగా ఉన్నందున ఆయన రాక బుధవారానికి వాయిదా పడింది.

వరి పొలాల్లో పాయలతో దోమపోటు దూరం

- జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

మాకవరపాలెం, సెప్టెంబరు 24: వరి పొలాల్లో దోమపోటు లేకుండా పాయలుతీయాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు తెలిపారు. మంగళవారం గిడుతూరు గ్రామంలో జిల్లా వ్యవసాయ అధి కారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఖరీఫ్ నుంచి ఈ కార్యక్రమం వారానికి రెండు రోజుల పాటు రైతు సేవా కేంద్రాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటిగా క్షేత్ర పర్యటన, తుదివరి రైతులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. రసాయనిక ఎరువులు వినియోగం తగ్గిస్తే వరిపంట దిగుబడి ఎక్కువగా వస్తుందన్నారు. అలాగే తెగుళ్ళు రాకుండా వ్యవసాయ అధికారులు అందించే సూచనలను రైతులు పాటించాలన్నారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ పథకాలు తప్పనిసరిగా తమ వివరాలు ఈ పంటలో నమోదు చేసుకొని కేవైసీ చేయించుకోవాలన్నారు. అనంతరం గిడుతూరు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చిరంజీవి, టీడీపీ నాయకులు చినబాబు, బుచ్చిరాంప్రసాద్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సులభంగా అర్థమయ్యే రీతితో గణిత బోధన

- డీఈవో వెంకటలక్ష్మమ్మ

నర్సీపట్నం, సెప్టెంబరు 24: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో గణిత శాస్త్రం బోధించాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి వెంకటలక్ష్మమ్మ సూచించారు. మంగళవారం గణిత శాస్త్రం బోధనపై జడ్పీహెచ్ స్కూల్(మెయిన్)లో డివిజన్ స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 12 మండలాలకు సంబంధించి ఎంఈవోలు, ఎంపికైన కేఆర్‌పీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు తప్పనిసరిగా ఉపాధ్యాయులు, పిల్లలు పాఠశాలలో ఉండాలన్నారు. ఏమైనా లోపాలు ఉంటే సరి చేసుకుంటూ అభివృద్ధి పథకంలో నడిపించాలని సూచించారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజన పథకం విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉండకూడదని సూచించారు.

నిండుకుండలా కోనాం జలాశయం

చీడికాడ, సెప్టెంబరు 24: మండలంలో కోనాం జలాశయం నిండుకుండలా కళకళలాడుతోంది. మంగళవారం ఉదయానికి జలాశయం ఎగువ ప్రాంతాల నుంచి అధికశాతం వరదనీరు చేరింది. ఈ జలాశయం గరిష్ఠ స్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, మంగళవారం సాయంత్రానికి 99.30 మీటర్లకు చేరుకుంది. ఎగువ ప్రాంతాల నుంచి 300 క్యూసెక్కులు వరదనీరు వస్తుండగా.., ఎగువ, దిగువ కాలువల ద్వారా మెయిన్‌గేటు నుంచి 180 క్యూసెక్కుల వరకూ సాగునీరు విడుదల చేస్తున్నట్టు ఏఈ సీహెచ్ జయరాం పడాల్ విలేకరులకు తెలిపారు.